# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

ఎడిటర్:బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 10-5-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 సంపుటి :29 సంచిక: 209 పేజీలు:6 వెల: రూ.1/-


## హైదరాబాద్ నగరంలో రెండు నిమిషాలపాటు అద్భుతం ఆవిష్కృతం

**-12.12 నుంచి 12.14వరకు మాయమైన నీడ**



హైదరాబాద్ మే 9 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);హైదరాబాద్ నగరంలో రెండు నిమిషాలపాటు అద్భుతం ఆవిష్కృతం అయింది. మధ్యాహ్నం 12.12 నుంచి 12.14వరకు నీడ మాయమైంది. నిట్టనిలువుగా సూర్యకిరణాలుపడటంతో నీడ మాయమవుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రతి సంవత్సరంలో రెండుసార్లు ఇలాంటి అద్భుతాలు జరుగుతాయంటున్నారు. మరోసారి ఆగస్టు నెలలో హైదరాబాద్ ప్రజలు ఇలాంటి అద్భుతాన్ని చూసే అవకాశం ఉంది.ఇది అరుదుగా జరిగే సంఘటన. సూర్యుడు ఉత్తరాయణం, దక్షిణాయణం సందర్భంలో ఇలాంటి మార్పులు కనపడటం ఒక భాగం అంటున్నారు. భూమి ఏటవాలుగా తిరుగడంగానీ, దీర్ఘవృత్తాకారంగా సూర్యుడి చుట్టూ తిరగడం వంటి మార్పులు వల్ల షాడో కనిపించకపోవడం వంటి అరుదైన ఖగోళ అద్భుతాలు జరుగుతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నగరంలోని బిర్లాటెంపుల్, ట్యాంక్ బండ్ పరిసరాల్లో శాస్త్రవేత్తలు జీరో షాడో డే సందర్భంగా ఖగోళ అద్భుతంపై ప్రజలకు అవగాహన కల్పించారు.అయితే నీడ మాయమవడం వెనక అతీత శక్తులు ఉన్నాయంటూ కొందరు నమ్ముతుంటారు. అలాంటి వారి సందేహాలను శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. కేవలం సూర్యుని చుట్టూ భూభ్రమణంలో భాగంగా కలిగే మార్పులే నీడ మాయమవడం వంటి అద్భుతాలు జరుతుతుంటాయని అంటున్నారు. అయితే జీరో షాడో డే అనేది ఖగోళ శాస్త్రవేత్తలు, ఫోటోగ్రాఫర్‌లకు ఒక ముఖ్యమైన సంఘటన. ఎందుకంటే ఇది అద్భుతమైన ఛాయాచిత్రాలను తీయడానికి ఒక ప్రత్యేక అవకాశాన్ని అందిస్తుంది.

## జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం ప్రధాన కార్యదర్శిగా కోట దామోదర్

హైదరాబాద్ మే 9 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):: జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం ప్రధాన కార్యదర్శిగా హైదరాబాద్ ఉప్పల్ చెందిన కోట దామోదర్ ను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున్, రాష్ట్ర అధ్యక్షుడు మాడా రాజా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కోట దామోదర్ మాట్లాడుతూ చేనేత కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం అంకితభావంతో చేనేత వర్గాల సమస్యలపై స్పందించి వాటిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సృష్టికి చేరే విధంగా కృషి చేస్తానన్నారు. చేనేత కార్మికులకు సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందే విధంగా కృషి చేస్తానన్నారు. నియామకానికి హకరించిన అవ్వారు మల్లికార్జున్, రుషింగప్ప, మాడ రాజా కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఇమ్రాన్ ఖాన్ అరెస్ట్... ఇస్లామాబాద్‌లో ఉద్రిక్తత

ఇస్లామాబాద్ మే 9 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: పాకిస్థాన్ మాజీ ప్రధాన మంత్రి, పీటీఐ చీఫ్ ఇమ్రాన్ ఖాన్‌ను పాకిస్థాన్ రేంజర్లు అరెస్ట్ చేశారు. ఇస్లామాబాద్ హైకోర్ట్ ఆవరణలో ఆయన్ను అరెస్ట్ చేశారు. అల్ కాదిర్ ట్రస్ట్ అవినీతి కేసులో అరెస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఇమ్రాన్ అరెస్ట్ సమయంలో కోర్టులో ఘర్షణ జరిగింది. దీంతో ఇమ్రాన్ లాయర్లకు గాయాలయ్యాయి. ఇమ్రాన్‌కు కూడా గాయాలయ్యాయని పీటీఐ కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ఇమ్రాన్‌ను పాక్ రేంజర్లు రహస్యప్రాంతానికి తరలించారు.ఇమ్రాన్ అరెస్ట్‌తో ఇస్లామాబాద్‌తో పాటు పాకిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో ఉద్రిక్తత నెలకొంది. మరోవైపు ఇమ్రాన్ మద్దతుదారులు కోర్టు బయట, దేశంలోని పలు పట్టణాల్లో విధ్వంసానికి దిగారు.పాకిస్థాన్ ముస్లిం లీగ్ - నవాజ్ పార్టీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం తనపై కుట్ర చేస్తోందని ఇమ్రాన్ ఆరోపిస్తున్నారు. ఎలాగైనా తనను కేసుల్లో ఇరికించాలని, హత్య చేయాలని ప్రభుత్వం కుట్ర చేస్తోందని అరెస్ట్‌కు ముందు ఇమ్రాన్ వీడియో సందేశం సోషల్ మీడియాలో విడుదల చేశారు.అటు ఇమ్రాన్‌పై 85 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని కేసుల్లో ఇప్పటికే బెయిల్ రాగా మరికొన్ని కేసుల విచారణ కొనసాగుతోంది.పాకిస్థాన్ ముస్లిం లీగ్ - నవాజ్ పార్టీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం ఖాతరు చేయడం లేదని ఇమ్రాన్ ఇటీవలే ఆరోపించారు.

మరోవైపు మూడు టెర్రరిజం కేసుల్లో ఇమ్రాన్‌కు లాహోర్ యాంటీ టెర్రరిజం కోర్టు ఇప్పటికే ముందస్తు బెయిలు మంజూరు చేసింది.

## నేడు వైఎస్ఆర్టిపి ఆధ్వర్యంలో ఐకేపీ కేంద్రాల దగ్గర ధర్నాలు

హైదరాబాద్ మే 9 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తడిసిన ధాన్యం కొనాలని, తూకంలో కోతలు పెట్టవద్దని రైతులు వేడుకుంటున్నా కేసీఆర్ గుండె కరగడం లేదని వైఎస్ షర్మిలమండిపడ్డారు. రేపు ఆధ్వర్యంలో ఐకేపీ కేంద్రాల దగ్గర ధర్నాలు నిర్వహించనున్నారు. రైతులు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేయాలని డిమాండ్ చేయనున్నారు. కిసాన్ సర్కార్ అంటే ఇదేనా కేసీఆర్? మిల్లర్లు, వ్యాపారులు క్వింటాల్‌కు 12 కిలోల తరుగు తీసి రైతుల పొట్టకొడుతున్నా మౌనం వీడవా? అని సీఎంను షర్మిల ప్రశ్నించారు.

### నేటి కందం- నేటికి అందం


నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం






(మే 10 ప్రథమ భారత స్వాతంత్ర్య పోరాటం జరిగిన రోజు..10-5-1857. ఆంగ్లేయులు దీనిని సిపాయిల తిరుగుబాటుఅని అన్నారు.

-రాధశ్రీ

సెల్:9494481210

# హైదరాబాద్ అభివృద్ధికై చిత్తశుద్ధితో పని చేస్తున్నాం : మంత్రి కేటీఆర్

హైదరాబాద్, మే9:హైదరాబాద్ మహానగరం అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. బేగంపేటలోని ధనియాలగుట్టలో అధునాతన సౌకర్యాలతో నిర్మించిన వైకుంఠధామాన్ని మంత్రి కేటీఆర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ ప్రసంగించారు. ఈ నిర్మాణాన్ని ఎంతో మంది ఆపే ప్రయత్నం చేసినప్పటికీ ఇంత చక్కటి వైకుంఠధామాన్ని ఏర్పాటు చేశారు. జూబ్లీహిల్స్‌లో మహా ప్రస్థానం అని కట్టారు. దాని కంటే ఇది అద్భుతంగా ఉందని గర్వంగా చెప్పొచ్చు అని కేటీఆర్ అన్నారు.

నగరం విశ్వనగరంగా ఎదగాలంటే అద్భుతమైన ఫ్లై ఓవర్లు, ప్రజా రవాణా వ్యవస్థ ఉండాలి. దాంతో పాటు 24 గంటల కరెంట్ ఉండాలి. మంచినీటి సరఫరా ఉండాల్సిందే. చెరువులు, నాలాలు బాగు చేసుకోవాలి. ఈ 9 ఏండ్లలో హైదరాబాద్ మహా నగరం మనందరం గర్వపడే విధంగా తయారైందా.. లేదా.. అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ ఆలోచించాలి అని కేటీఆర్ సూచించారు.

హైదరాబాద్‌పై రజనీకాంత్, లయ ప్రశంసలు

హైదరాబాద్ అభివృద్ధిని చూసి తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రశంసించారు. హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాలను చూస్తుంటే.. ఇది మన దేశంలో ఉన్నదా.. లేక న్యూయార్క్ నగరమా.. అనే స్థాయిలో హైదరాబాద్ మారిపోయింది అని రజనీకాంత్ అన్నారు. సినిమా యాక్టర్ లయ అనే అమ్మాయి కూడా హైదరాబాద్‌పై ప్రశంసలు కురిపించింది. అమెరికాలో ఉంటున్న ఆమె ఈ మధ్యలోనే హైదరాబాద్‌కు తిరిగి వచ్చింది. కొన్ని కొన్ని ప్రాంతాలను చూస్తుంటే లాస్ ఏంజెల్స్‌లో, న్యూయార్క్‌లో ఉన్నట్టు అనిపిస్తుందన్నారని కేటీఆర్ గుర్తు చేశారు.

**సమస్యలు ఉన్నాయి.. ఇంకా ఉంటాయి..**

హైదరాబాద్ అంతా మారిపోయింది. భూతలస్వర్గం అయిపోయిందని తాను చెప్పట్లేదు అని కేటీఆర్ పేర్కొన్నారు. సమస్యలు ఉన్నాయి.. ఇంకా ఉంటాయి. మనిషి భూమ్మీద ఉన్నంత కాలం సమస్యలు ఉంటాయి. అమెరికాలో ఉండే సమస్యలు అక్కడ ఉంటాయి. కనీసం మౌలిక వసతులు, కరెంట్, నీళ్లతో పాటు ఇతర అవసరాలు కల్పించాలి. వాటిపై దృష్టి సారించాలి. ప్రజలకు కావాల్సిన సదుపాయాలు కల్పించాలి. సమర్థవంతమైన నాయకుడు కేసీఆర్ వల్లే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మంచి నాయకులను, ప్రభుత్వాలను కాపాడుకోవాలి. కేసీఆర్‌ను మూడోసారి గెలిపించుకునేందుకు చిత్తశుద్ధిగా పని చేయాలి అని కేటీఆర్ తెలిపారు.

**డ్రైనేజీ వ్యవస్థను బాగు చేస్తున్నాం..**

అన్ని నాలాలను అభివృద్ధి చేస్తున్నాం. డ్రైనేజీ వ్యవస్థను బాగు చేస్తున్నాం అని కేటీఆర్ తెలిపారు. లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టాం. ఈ నాలుగు నెలల్లోనే అందిస్తాం. దశబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించుకున్నాం. కులం, మతం అనే తేడా లేకుండా ముందుకు వెళ్తున్నాం. ఎయిర్‌పోర్టు దాకా మెట్రో వేసుకుంటున్నాం. ప్రభుత్వ చిత్తశుద్ధిని అందరూ గమనించాలి. మాటలు తిట్టడం ఈజీ.. మాకు కూడా తిట్లు వస్తాయి. కానీ ప్రజలకు ఏం చేశామనేది ముఖ్యం. బీజేపీ నాయకులు ఒక రూపాయి కూడా సాయం చేయలేదు. హైదరాబాద్ వరద బాధితులకు తెలంగాణ ప్రభుత్వం రూ. 660 కోట్ల సాయం చేసింది. కనీసం ఆరు పైలు కూడా కేంద్రం సాయం చేయలేదు అని కేటీఆర్ మండిపడ్డారు. ఇవాళ కేసీఆర్ ప్రభుత్వం మీ కోసం చిత్తశుద్ధితో హైదరాబాద్ నగరాన్ని బాగు చేసే ప్రయత్నం చేస్తున్నాం. పెట్టుబడులు తరలివస్తున్నాయి. అందుకు కారణం రాజకీయ స్థిరత్వమే అని కేటీఆర్ పేర్కొన్నారు.

## నేడు తెలంగాణ పదో తరగతి ఫలితాలు విడుదల

హైదరాబాద్ మే 9 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణ పదో తరగతి ఫలితాలు రేపు విడుదల కానున్నాయి. పది ఫలితాలను బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి విడుదల చేయనున్నారు. పది ఫలితాల కోసం అనే వెబ్‌సైట్‌ను సందర్శించొచ్చు.ఏప్రిల్ 3వ తేదీ నుంచి 11వ తేదీ వరకు పది పరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. టెన్త్ ఎగ్జామ్స్‌కు 99.63 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. పది పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 4,86,194 మంది దరఖాస్తు చేసుకోగా, 4,84,384 మంది ఎగ్జామ్స్ రాశారు. 1,809 మంది పరీక్షలకు హాజరు కాలేదు. ప్రయివేటు విద్యార్థులు 443 మంది దరఖాస్తు చేసుకోగా, 191 మంది మాత్రమే హాజరయ్యారు.

## గురుకుల విద్యార్థులను అభినందించిన మంత్రి సత్యవతి

హైదరాబాద్, మే9: ఇంటర్ ఫలితాల్లో గురుకుల విద్యార్థులు సత్తాచాటారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా ఫలితాలు సాధించారు. తెలంగాణవ్యాప్తంగా ఉన్న గిరిజన గురుకులాల్లో విద్యార్థులు 84శాతం పర్సంటైల్ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ విద్యార్థులను అభినందించారు. గిరిజనుల పేదరికాన్ని శాశ్వతంగా తొలగించాలంటే నాణ్యమైన విద్య ఒక్కటే మార్గమని సీఎం కేసీఆర్ భావించి.. గురుకులాలను ఏర్పాటు చేశారన్నారు. ఇంటర్ ఫలితాల్లో ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 73.65శాతం, సెకండియర్‌లో 84.95శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు.

ద్వితీయ సంవత్సరంలో భూక్య గణేశ్ 991 , పుణెమ్ అక్షిత్ 985 , ఎం కావ్య 988 .. మొదటి సంవత్సరం ఫలితాల్లో వాంకుడోత్ భువన్ 467/470 మార్కులు సాధించారన్నారు. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేనివిధంగా అన్నివర్గాలకు కేజీ టు పీజీ విద్య ఉచితంగా అన్నివర్గాలకు ఉన్నత ప్రమాణాలతో అందిస్తున్నారని, దాంతో గురుకుల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ప్రైవేట్ దీటుగా ర్యాంకులు సాధించడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యధిక మార్పులు సాధించిన విద్యార్థులను మంత్రి అభినందించారు.

రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలు సత్ఫలితాలిస్తున్నాయనడానికి విద్యార్థులు సాధిస్తున్న ఉత్తీర్ణత శాతమే నిదర్శనమన్నారు. గురుకులాల్లో నాణ్యమైన విద్యావిధానం, ఇంగ్లిష్ మీడియంలో బోధన, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారం వంటి విద్యాభివృద్ధి పథకాలను రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదు పెరిగిందని తెలిపారు. రికార్డు స్థాయిలో గిరిజన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేసిన అధికారులను, ఉపాధ్యాయులను సిబ్బందిని మంత్రి అభినందించారు.

## జూన్ 4 నుంచి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

హైదరాబాద్ మే 9 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణ ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి విడుదల చేశారు. మొత్తం ఇంటర్ ఫస్టియర్, సెకండియర్‌లో 61.68 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు మంత్రి వెల్లడించారు. కాగా, బాలికలు 68.68 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలురు 54.66 శాతం ఉత్తీర్ణత సాదించారు.ఇంటర్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థుల కోసం జూన్ 4 నుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు అవకాశం కల్పించామన్నారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన ఫీజు వివరాలు, టైం టేబుల్‌ను త్వరలోనే ప్రకటిస్తామన్నారు.అయితే ఫెయిలైన విద్యార్థులను వారి తల్లిదండ్రులు దగ్గరకు తీసుకొని భరోసా కల్పించాలని సబితా ఇంద్రారెడ్డి సూచించారు. విద్యార్థులు ఎలాంటి ఆవేశాలకు లోను కావొద్దని, మళ్లీ పరీక్షలు రాసి పాస్ కావాలని సూచించారు. విద్యార్థులకు తల్లిదండ్రులు బాసటగా నిలిచి, వారిలో మనో ధైర్యాన్ని అందించాలన్నారు.

# బీఆర్ఎస్ ప్రభుత్వ సలహాదారుగా సోమేశ్ కుమార్

**-మంగళవారం ఉత్తర్వులు జారీ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి**



హైదరాబాద్ మే 9 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); మహారాష్ట్రకు చెందిన శరద్ మన్కడ్‌కు తెలంగాణ సర్కారు ఇటీవలే కొలువు కట్టబెట్టిన సంగతి తెలిసిందే. ఈ నియామకం జరిగి పట్టుమని పది రోజులు కూడా కాకముందే మరో కండువా కొలువును కేసీఆర్ తన ప్రీతిపాత్రుడికి కట్టబెట్టారు. తెలంగాణ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేరారు.కేబినేట్ హోదాతో కూడిన తన ప్రధాన సలహాదారుడిగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు సోమేశ్ కుమార్‌ను నియమించారు. సీఎం కేసీఆర్ నిర్ణయం మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సోమేశ్ కుమార్ మూడు సంవత్సరాల కాలం పాటు పదవిలో కొనసాగనున్నారు.తెలంగాణ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. బిహార్‌కు చెందిన ఆయన 1989 బ్యాచ్ ఐఏఎస్ అధికారి.. రాష్ట్ర విభజన సమయంలో ఆయనను ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు కేటాయించినా.. సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ (క్యాట్) ఉత్తర్వుల మేరకు తెలంగాణలోనే కొనసాగారు. ఆ తరావ్త తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘ కాలం పని చేశారు. అయితే క్యాట్ ఉత్తర్వులను డీవోపీటీ తెలంగాణ హైకోర్టులో సవాల్ చేయడంతో హైకోర్టు ఆయనను తక్షణం ఏపీలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. మరో అవకాశం లేకపోవడంతో 2023 ఫిబ్రవరిలో ఆయన ఏపీ జీఏడీలో రిపోర్టు చేశారు. ఆ వెంటనే హైదరాబాద్‌కు వచ్చారు. ఏపీ ప్రభుత్వం కూడా ఆయనకు ఎలాంటి పోస్టింగ్ ఇవ్వలేదు. ఒక రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి, మరో రాష్ట్రంలో అంతకంటే తక్కువ పోస్టులో పని చేయడానికి సోమేశ్ ఇష్టపడలేదు. ఆయన స్వచ్ఛంద పదవీ విరమణ చేస్తారని అప్పట్లోఒక పత్రిక కథనం కూడా ప్రచురించింది. దానిని ఆయన ఖండించినప్పటికీ కొద్ది రోజుల తర్వాతే ఆయన స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్నారు. ఆయన స్వచ్ఛంద పదవీ విరమణకు ఏపీ ముఖ్యమంత్రి జగన్ ఆమోద ముద్ర వేశారు.వాస్తవానికి సోమేశ్ కుమార్‌కు 2023 డిసెంబర్ వరకూ సర్వీస్‌లో కొనసాగే అవకాశముంది. కానీ తెలంగాణ ప్రభుత్వంలో మరో పోస్టులో కొనసాగడానికి వీలుగా ఆయన ముందుగా వీఆర్ఎస్ తీసుకున్నట్లు వార్తలొచ్చాయి. ఇటు డీవోపీటీ నిబంధనల ప్రకారం 30 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసిన వారు స్వచ్ఛంద పదవీ విరమణ చేస్తే.. దానిని కేంద్రం ఆమోదించాల్సిన అవసరం లేదు. సదరు అధికారులు ఏ రాష్ట్రానికి కేటాయించిన వారు అయితే ఆ రాష్ట్ర ప్రభుత్వమే వీఆర్ఎస్‌ను ఆమోదించవచ్చు. సోమేశ్ కుమార్ కూడా ఈ నిబంధనలను ఉపయోగించుకుని వీఆర్ఎస్‌ను ఆమోదింప చేసుకున్నట్లు ఐఏఎస్ వర్గాల్లో చర్చ జరిగింది. ఇన్ని నెలల తర్వాత సోమేశ్ కుమార్‌ను మళ్లీ తెలంగాణ ప్రభుత్వమే అక్కున చేర్చుకుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తొలి చీఫ్ సెక్రటరీగా పనిచేసిన రాజీవ్ శర్మ ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వ ముఖ్య సలహాదారు పదవిలో కొనసాగుతున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రిన్సిపల్ సెక్రటరీగా నర్సింగరావు ఉన్నారు. అయినా సోమేశ్ కుమార్‌ను తన ప్రధాన సలహాదారుడిగా ముఖ్యమంత్రి కేసీఆర్ నియమించడంపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. అవ్వడానికి ప్రభుత్వ ప్రధాన సలహాదారు పదవే అయినప్పటికీ బీఆర్ఎస్ పార్టీ కోసం సోమేశ్ కుమార్ పనిచేయనున్నట్లు సమాచారం. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన అనుభవం సోమేశ్‌కు ఉండనే ఉంది. ప్రజల్లో బీఆర్ఎస్ ప్రభుత్వంపై వ్యక్తమవుతున్న అసంతృప్తిని తగ్గించే మార్గాలను అన్వేషించడమే సోమేశ్ విధిగా తెలుస్తోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విక్టరీనే లక్ష్యంగా సోమేశ్ పాలనాపరంగా పావులు కదపనున్నారు. అయితే.. రాజకీయంగా సోమేశ్ నియామకం పెను దుమారాన్ని రేపింది. ప్రతిపక్షాలు సోమేశ్‌కు కొలువు కట్టబెట్టడంపై విమర్శల బాణాలు ఎక్కుపెట్టాయి.

## తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల

**-బాలికలదే పై చేయి**

**-బాలికల ఉత్తీర్ణతాశాతం 71.57 కాగా.. బాలుర ఉత్తీర్ణతాశాతం 55.60.**



హైదరాబాద్ మే 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):: తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. మార్చిలో నిర్వహించిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాలను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి విడుదల చేశారు. విద్యాశాఖ అధికారులతో కలిసి ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఫలితాలను మంత్రి రిలీజ్ చేశారు. మొత్తం 9,47,699 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాశారు https://tsbie. cgg.gov.in, https://results.cgg.gov.in వెబ్‌సైట్లలోచూడవచ్చు.కాగా.. ఈ ఫలితాల్లో బాలికలే పై చేయి సాధించారు. ఫస్టియర్‌లో బాలికల ఉత్తీర్ణతాశాతం 68.68 కాగా.. బాలుర ఉత్తీర్ణతాశాతం 54.66 మాత్రమే. సెకండియర్‌లో బాలికల ఉత్తీర్ణతాశాతం 71.57 కాగా.. బాలుర ఉత్తీర్ణతాశాతం 55.60.

## విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు మంత్రి సబితా పలు కీలక సూచనలు




హైదరాబాద్, మే9:తెలంగాణ ఇంటర్ పరీక్షలలో మొత్తం 9,47,699 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. ఫస్టియర్‌లో 63.85 శాతం, సెకండియర్‌లో 67.26 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు మంత్రి, విద్యాశాఖ అధికారులు పలు కీలక సూచనలు చేశారు.

- ఫెయిల్ అయిన విద్యార్థులు భాధపడొద్దు.. ఆందోళన చెందవద్దు
- పిల్లలపై తల్లిదండ్రులు ఫెయిల్ అయితే సీరియస్ అవ్వొద్దు
- ఫలితాలపై ఎవరికైనా సందేహాలు ఉంటే రీ- వెరిఫికేషన్ చేసుకోవచ్చు
- మే- 10 నుంచి మే- 16 వరకు సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులు ఫీజు చెల్లించుకోవచ్చు
- జూన్ 4 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ఉంటాయి
- సెకండియర్ ఫెయిల్ అయిన విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు
- ఎంసెట్ రాసేవాళ్ళు ఇంటర్మీడియట్ ఫలితాలను పట్టించుకోవద్దు
- ఎంసెట్ రాసేవాళ్ళు ప్రశాంతంగా పరీక్షలు రాయండి
- విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దనే ఎంసెట్‌లో ఇంటర్ మార్కుల వెయిటేజ్ తొలగించాం
- ఇంటర్మీడియట్ ఫలితాలు ప్రభుత్వ కళాశాలలో మెరుగ్గా ఉంది
- జూనియర్ కాలేజీలు రెసిడెన్షియల్ పాఠశాలతో పోటీ పడాలి
- ప్రైవేట్ ఎయిడెడ్ కాలేజీల్లో 46శాతం మాత్రమే ఫలితాలు ఉన్నాయి

**ఇదిగో హెల్ప్‌లైన్.. కాల్ చేయండి..**

- ఇంటర్ విద్యార్థుల కోసం టెలీ మానస్ హెల్ప్ లైన్ నంబర్ ఏర్పాటు చేశాం
- హెల్ప్ లైన్ నెంబర్ 14416 కు కాల్ చేసి సలహాలు, సూచనలు పొందవచ్చు
- ఈ నంబర్ విద్యార్థులకు పరీక్షా సమయంలో కూడా ఉపయోగపడంది
- ఒత్తిడి, మానసిక సమస్యలతో బాధపడే వారికి ఇది అండగా ఉంటుంది

4.33 లక్షల మంది ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు రాశారు. ఇందులో 2.72 లక్షల మంది మాత్రమే పాసయ్యారు. ఇందులో బాలికలే ఎక్కువ మంది పాసయ్యారు. ం గ్రేడ్, 1.60 లక్షల మంది, ః గ్రేడ్ 68,333 మంది పాసయినట్లు సబిత తెలిపారు. ఫస్టియర్ ఫలితాల్లో మేడ్చల్.. సెకండియర్‌లో ములుగు జిల్లాలు ప్రథమ స్థానంలో నిలిచినట్లు మంత్రి వెల్లడించారు.

## మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**-అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి నదిలోకి పడిపోయిన బస్సు-14 మంది మృతి**

భూపాల్ మే 9 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);మధ్యప్రదేశ్ లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఓ బస్సు అదుపుతప్పి బ్రిడ్జి పై నుంచి నదిలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. వివరాల్లోకి వెళితే..శ్రీఖండి నుంచి ఇండోర్ వెళ్తున్న బస్సు ఖార్గోన్ జిల్లాలో ప్రమాదవశాత్తు నదిలో పడిపోయింది. నదిపై ఉన్న వంతెన రెయిలింగ్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 14 మంది మృతి చెందగా.. 20 మంది గాయపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 70 మంది ప్రయాణికులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఘటనాస్థలి వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

## బిసి కమిషన్ చైర్మన్‌ను కలిసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



హైద్రాబాద్, మే 09 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారామ్ అహిర్ ను ఈ రోజు ఉదయం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్ లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఒకరోజు పర్యటనకు హైదరాబాద్ కు వచ్చిన హన్సరాజ్ గంగారామ్ ను హరితా ప్లాజా లో కలసి తెలంగాణా రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు అమలవుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను సి.ఎస్ శాంతి కుమారి వివరించారు.

తెలంగాణ రాష్ట్రంలో ఓబీసీలకు రిజర్వేషన్లు, రిజర్వేషన్ రోస్టర్ అమలుపై బీసీ కమిషన్ చైర్మన్ కు సి.ఎస్, వివరించారు. రాష్ట్రంలో మహిళల బద్రత కోసం ఏర్పాటు చేసిన " షీ టీమ్స్" కార్యకలాపాలను కమిషన్ చైర్మన్ కు పోలీసు విభాగం డైరెక్టర్ జనరల్ అంజనీ కుమార్ వివరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల కోసం పోలీసు విభాగం చేపట్టిన వివిధ కార్యక్రమాలు, విభాగంలో పోలీసుల సంక్షేమం కోసం చేపట్టిన చర్యలను, అమలౌతున్న విధి విధానాలను ఆయనకు వివరించారు. జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారామ్ అహిర్ ను పార్లమెంట్ సభ్యులు డా. కె. లక్ష్మన్, జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ సభ్యులు టి. ఆచారి, సలహాదారు రాజేష్ కుమార్, బిసి సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, బిసి వెల్ఫేర్ డైరెక్టర్ అలోక్ కుమార్ ఇతర అధికారులు మర్యాదపూర్వకంగా కలిసారు.

# నిజాయితీ, నిబద్ధతలకు రూ: 1,500/- కోట్ల బహుమానం

ఇండియాలోనే కాకుండా ప్రపంచ అత్యంత ధనవంతుల్లో ఒకడుగా రిలియన్స్ అధినేత, అపార కుబేరుడు ముఖేశ్ అంబానీ (ఆస్తి విలువ 85 బిలియన్ డాలర్లు లేదా రూ: 7 లక్షల కోట్లు) మనందరికీ తెలుసు. బిలియనీర్ అంబానీ సంస్థల్లో సుదీర్ఘకాలంగా నమ్మకస్తుడిగా, విధేయుడిగా, అత్యున్నత వ్యక్తిత్వం స్వంతం చేసుకున్న ఉద్యోగిగా, నేర్పరితనంతో చర్చల సామర్థ్యం (నెగోషియేషన్ స్కిల్స్) కలిగి మె?న్నటి తరం వ్యాపారవేత్త ధీరూభాయ్ అంబానీ/నీతూ అంబానీ, నిన్నటి తరం ముఖేశ్ అంబానీ నుంచి నేటి మూడోతరం ఇషా, ఆకాష్, అనంత్ అంబానీల వరకు గత మూడు తరాలకు నమ్మకస్తుడిగా విశిష్ట సేవలందించిన 65 ఏండ్ల గుజరాతీ మనోజ్ హరివంజన్ మోదీ విధేయతకు మెచ్చిన అంబానీ కుటుంబం ముంబాయి నడి బొడ్డున పోష్ లొకాలిటీలో ఉన్న 1,500 కోట్ల విలువైన 22-అంతస్తుల (ఒక్కొక్క ఫ్లోర్ 8,000 చదరపు అడుగులు) భవనాన్ని బహుమతిగా అందించడం ఓ ఆశ్చర్యకర వార్తగా పౌర సమాజం నివ్వెరపోయి చూస్తున్నది.

## ముఖేశ్ అంబానీ క్లాస్‌మేట్ మనోజ్ మోదీ:

ముఖేశ్ అంబానీతో కలిసి ముంబాయి యూనివర్సిటీలో కెమికల్ టెక్నాలజీ చదువుకున్న స్నేహితుడైన మనోజ్ మోదీ 1980 నుంచి ధీరూభాయ్ అంబానీతో కలిసి రిలియన్స్ ఇండస్ట్రీస్‌లో వివిధ హోదాల్లో అంకితభావంతో ఉద్యోగం చేస్తున్నారు. మనోజ్ తండ్రి హరిజీవన్ దాస్ కూడా ధీరూభాయ్ నేతృత్వంలో పని చేసేవారు. రిలియన్స్‌లో ఉన్నత స్థాయి ఉద్యోగిగా మనోజ్ మోదీ ఫేస్‌బుక్ లాంటి ఇతర సంస్థలతో వేల కోట్ల ఒప్పందాలు చేసుకోవడంలో ప్రధాన భూమిక నిర్వహించారు. ప్రస్తుతం రిలియన్స్ రిటైల్, రిలియన్స్ జియోలకు డైరెక్టర్‌గా, టాలీ సొల్యూషన్స్/ఈస్ట్ ఇండియా హోటల్స్ లిమిటెడ్/రిలియన్స్ పెట్రోకెమికల్స్ డైరెక్టర్‌గా, వ్యవహరిస్తున్న మనోజ్ ఇప్పటికీ ముఖేశ్ అంబానీ కుడి భుజంగా నిలుస్తున్నారు. బొంబాయి విశ్వవిద్యాల యంలో కెమికల్ ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేసిన మనోజ్ మోదీ రిలియన్స్ ఉద్యోగిగా జామ్‌నగర్ రిఫైనరీ, హాజీరా పెట్రోకెమికల్ కాంప్లెక్స్, టెలికమ్ బిజినెస్, రిలియన్స్ రిటైల్, రిలియన్స్ జియా, 4జీరోలౌట్ విభాగాల్లో వివిధ హోదాల్లో అమూల్య సేవలు అందిస్తూ వస్తున్నారు. రిలియన్స్ నుంచి భారీ మె?త్తంలో జీతం పొందుతున్న మనోజ్ ప్రస్తుతవ్యక్తిగత ఆస్తుల విలువ దాదాపు 9,650/- కోట్లు డాలర్లు ఉండవచ్చని అంచనా. 2020లో రిలియన్స్ పక్షాన నిలిచి ఫేస్‌బుక్‌తో 43,000 కోట్ల డీల్ చేయించడంలో మనోజ్ పాత్ర అనన్యసామాన్యమని ఉద్యోగులు చెప్పుకుంటారు.

## 1,500 కోట్ల విలువైన విలాసవంతమైన 22-అంతస్తుల భవనమే బహుమతిగా?!

ముంబాయిలోని 'నేపియన్ సీ రోడ్డు' ప్రాంతంలో 1.7 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మింపబడిన 22-అంతస్తుల 'బ్రిందావన్' అనబడే భవనంలో 7 అంతస్తులు పార్కింగ్ కోసం, 19-21 అంతస్తుల్లో పెంట్‌హౌజ్‌లో మనోజ్ మోదీ భార్యాభర్తలు, ఇతర అంతస్తుల్లో అతని ఇద్దరు కూతుర్లు (రిలియన్స్‌లో ఉన్నత ఉద్యోగులు) నివసించడానికి కేటాయించారు. ఇదే ఇంటిలో వైద్య సౌకర్యాలు, ఈత కొలను, పూజా మందిరం, మనోజ్ క్యాంపు కార్యాలయం, వినోద వసతులు, జిమ్, స్పా, థియేటర్, సమావేశ మందిరం లాంటి పలు సౌకర్యాలతో పాటు ఇటలీ నుంచి దిగుమతి చేసుకున్న పర్నీచర్ వాడి నిర్మించిన ఇళ్లు భూతల స్వర్గంగా గోచరిస్తున్నదని వింటున్నాం. దాదాపు 175 మంది ఉద్యోగులు పని చేస్తున్న ఇంటిలో భద్రత పరమైన పటిష్ట ఏర్పాట్లు కూడా ఉండడం విశేషం.

రిలియన్స్‌లో 'యంయం' (మనోజ్ మోదీ)గానే కాకుండా 'అనధికారిక సిఈఓ'గా ముద్దు పేర్లతో పిలువబడే మనోజ్ మోదీ నైతికత, నిజాయితీతో కూడిన నిబద్ధత, నిస్వార్థ సేవా గుణం, పని చేసే సంస్థ పట్ల చూపుతున్న అంకితభావం, అలుపెరుగని శ్రామిక శక్తి, నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ప్రదర్శించే విధేయత లాంటి అనేక సుగుణాలు స్వంతం చేసుకున్న మనోజ్ మోదీ ఉద్యోగ జీవితం నేటి యువతకు ఆదర్శమే కాదు ఆచరణీయం కూడా.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# తెలంగాణలో రాజ్యహింస పాలన- సీఎల్పీ నేత భట్టి



హైదరాబాద్, మే9: తెలంగానను సాధించుకొని రాష్ట్రాన్ని రాజ్యహింస పాలకుల చేతుల్లో పెట్టి తెలంగాణ ప్రజలు నరకం అనుభవిస్తున్నారని, అందుకే పీపుల్స్ మార్చ్ పేరుతో ప్రజల వద్దకే వెళ్లి వారికి భరోసా ఇస్తున్నామని, వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు గుణపాఠం చెప్పడం తప్పదని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీఎల్పీ నాయకులు బట్టి విక్రమార్క హెచ్చరించారు. మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు మండలంలో 500 ఎకరాల పేదల భూమిని అప్పనంగా ఫార్మాసిటీకి అప్పగించింది కేసీఆర్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంను గద్దె దించడమే కాంగ్రెస్ పార్టీకి ముందున్న సవాల్ అని సిఎల్పి నాయకులు భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మహేశ్వరం నియోజకవర్గం మీర్పేట్ మున్సిపాలిటీ జిల్లెలగూడలో పీపుల్స్ మార్చ్ పాదయాత్రను మల్లు భట్టి విక్రమార్క నాయకత్వంలో ప్రారంభించారు. పాదయాత్ర మీర్పేట్, అల్మాస్ గూడ బడంగ్ పెట్, నాగర్ గుల్ ప్రాంతాల మీదుగా పాదయాత్ర సాగింది. పాదయాత్రలో ప్రజా గాయకులు గద్దర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చల్ల నరసింహారెడ్డి, బడంగ్పేట్ మున్సిపల్ మేయర్ పారిజాత నరసింహారెడ్డి, పిసిసి సభ్యులు యేల్మెటి అమరేందర్ రెడ్డి, దేప భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ? తెలంగాణ రాష్ట్రంలో రాజ్యహింస భయంకరమైన పరిస్థితులు ఎలా ఉంటాయో ఇప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వంలో చూస్తున్నట్లు ఉందని తెలిపారు.

ప్రశ్నించిన వారిపై కేసులు, నిలదీస్తే నిర్బంధం, ఎదురు తిరిగితే లాఠీ చార్జీలు, హక్కుగా ఇచ్చిన భూమిలో కట్టుకున్న ఇళ్లను కూల్చివేస్తూ రాజధాని నడిబొడ్డున రాజ్యహింస భయంకరమైన పరిస్థితి ఎలా ఉంటుందో బీఆర్ఎస్ సర్కార్ చూపిస్తుందన్నారు. కష్టపడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో నిశ్శబ్దంగా, మౌనంగా, కనిపించకుండా ప్రభుత్వం రాజ్య హింస చేస్తుందని తెలిపారు.

ప్రభుత్వ ధమనకాండపై ప్రజాసంఘాలు, సామాజిక బాధ్యత కలిగిన రాజకీయ పార్టీలు పేదలకు అండగా నిలబడేవి.. కానీ ఇప్పుడు పేదల భూములను బలవంతంగా గుంజుకుంటున్నా ఏ ఒక్కరూ నోరు మెదపకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాలు హక్కుగా పేదలకు ఇచ్చిన భూమి లాక్కునే హక్కు ఈ ప్రభుత్వానికి లేదన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోనే ఐదు లక్షల కోట్ల విలువైన పదివేల ఎకరాల భూమిని ఈ ప్రభుత్వం పేదలను భయపెట్టి బలవంతంగా గుంజుకున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని చుట్టూ 25 లక్షల కోట్ల విలువైన పేదల భూములను ఈ ప్రభుత్వం గుంజుకున్నదని, ఇది పేదల పట్ల జరుగుతున్న అతిపెద్ద కుట్ర అని ఆరోపించారు.

పేదల నుంచి గుంజుకున్న భూములను సంపన్న వర్గాలకు, కంపెనీలకు, హెచ్ఎండీఏ లేఔట్ చేయడానికి కేటాయించడం దుర్మార్గ చర్యని అన్నారు. గత ప్రభుత్వాలు హక్కుగా ఇచ్చిన భూములు గుంజుకునే హక్కు ఎవరికీ లేదన్నారు. వచ్చే జూన్ మాసంలో నైరుతి రుతుపవనాలు ప్రారంభమయ్యే లోపు మీ భూముల్లో మీరు అరక పట్టి దుక్కి దున్నుకొని పంట పండించుకోవడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మీకు ఇచ్చిన ఇంటి స్థలాలు ఇల్లు కట్టుకోవడానికి సమాయత్తం కావాలన్నారు. ఎవరు అడ్డువస్తారో చూస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ మీకు అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్పేట్, నాదర్గుల్, ఆల్మాస్ గూడ, మామిడిపల్లిలో గత కాంగ్రెస్ ప్రభుత్వం 4వేల మంది పేదలకు ఇచ్చిన ఇండ్ల స్థలాలను బలవంతంగా గుంజుకోవడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కేసీఆర్ పాలన కట్టింది కూలగొట్టు.. కమిషన్లు కొట్టు.. ఎన్నికల్లో పంచి పెట్టు.. గద్దెనెక్కు అన్న చందంగా నడుస్తుందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో ఓట్ల విప్లవం రావలసిన సమయం ఆసన్నమైందన్నారు. కాంగ్రెస్ శ్రేణులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు ఈ ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలను వివరించి చైతన్య పరిచి కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపే విధంగా ఓట్లు పోలరైజ్ చేసుకోవాలని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రశ్నించే వాళ్లు లేకుండా పోతున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమని హెచ్చరించారు. చల్ల నరసింహారెడ్డి మాట్లాడుతూ? మహేశ్వరం నియోజకవర్గంలో భట్టి విక్రమార్క పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నట్లు తెలిపారు. మేయర్ పారిజాత నరసింహారెడ్డి మాట్లాడుతూ? బడంగ్పేట్ లో ప్రభుత్వ భూమి కబ్జా చేస్తున్నారని ప్రశ్నిస్తే కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులు పెడతారని ఆరోపించారు. ప్రియాంక గాంధీ ఇచ్చిన హామీలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అమలు చేస్తారని తెలిపారు. ఇచ్చిన మాట తప్పని కుటుంబం గాంధీ కుటుంబం అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ పార్టీ అధ్యక్షులు పెద్దబావి వెంకటరెడ్డి, కార్పొరేటర్స్ ప్రభాకర్ రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, రాళ్ల గూడెం సంతోషం శ్రీనివాస్ రెడ్డి, చల్ల కవిత బాల్ రెడ్డి, బండారి మనోహార్, సిద్దాల మౌనిక శ్రీశైలం, అమృత నాయుడు, బోయపల్లి రాఘవేంద్ర రెడ్డి బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, నవారు మల్లారెడ్డి, గట్టు బాలకృష్ణ, సుర్ణ గంటి విజయ్, పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మే 10 నుండి 12 వరకు.. వెంకటేశ్వరస్వామి వార్షిక వసంతోత్సవాలు

తిరుపతి, మే9మే 10నుండి 12వరకు శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్షిక వసంతోత్సవాలు జరగనున్నాయి. వసంత రుతువులో లభించే పుష్పాలు, ఫలాలను సమర్పించి స్వామివారి దివ్యానుగ్రహం పొందడమే ఈ వసంతోత్సవం అంతరార్థమని అర్చకులు వెల్లడించారు. మే 11న సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు స్వర్ణ రథంపై శ్రీదేవి , భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారని ఆలయ అర్చకులు తెలిపారు.. ఉత్సవర్లను ఆలయంలోని వసంత మండపానికి తీసుకొచ్చి ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్ సేవ, వీధి ఉత్సవం నిర్వహిస్తారని చెప్పారు. తొలి రెండు రోజులు శ్రీవారు ఉభయనాంచారులతో కలిసి వసంతోత్సవంలో పాల్గొంటారని వివరించారు. చివరి రోజు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి, సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత రామచంద్రమూర్తి, రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామివారి ఉత్సవమూర్తులను వసంత మండపానికి తీసుకొస్తారని వెల్లడించారు.అనంతరం శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం, ఆస్థానం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

# సైబర్ సురక్షిత్ భారత్ కింద 36వ సిఐఎస్ఓ డీప్-డైవ్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎన్ఇజీడీ

న్యూఢిల్లీ, మే 9:కెపాసిటీ బిల్డింగ్ పథకం కింద నేషనల్ ఇ-గవర్నెన్స్ డివిజన్ (ఎన్ఇజీడీ) 36వ సిఐఎస్ఓ డీప్ డైవ్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. మే 8, 2023 నుండి 12వ తేదీ వరకు న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమంలో సెంట్రల్ లైన్ మినిస్ట్రీస్ మరియు రాష్ట్రాలు/యుటిల నుండి 24 మంది పాల్గొంటున్నారు.

ఈ ఐదు రోజుల ఇంటెన్సివ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కేంద్ర మరియు రాష్ట్ర/కేంద్రపాలితప్రాంత ప్రభుత్వాల నుండి నియమించబడిన సిఐఎస్ఓల కోసం రూపొందించబడింది.

వీరిలో ప్రభుత్వ రంగ బ్యాంకులు మరియు బీమా కంపెనీలు, పోలీసు మరియు భద్రతా దళాల సాంకేతిక విభాగాలు, సిటిఓలు మరియు సాంకేతిక/పిఎంయు బృందాల సభ్యులతో పాటు సబార్డినేట్ ఏజెన్సీలు/పిఎస్‌యులు అలాగే సంబంధిత సంస్థలలో ఐటీ వ్యవస్థల భద్రతకు బాధ్యత వహించే అధికారులు ఉన్నారు.

సైబర్ సురక్షిత్ భారత్ అనేది ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (ఎంఇఐటివై) కార్యక్రమం. ఇది సైబర్ క్రైమ్ గురించి అవగాహన కల్పించడం మరియు అన్ని ప్రభుత్వ విభాగాలలో చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్లు (సిఐఎస్ఓలు) మరియు ఫ్రంట్‌లైన్ ఐటీ అధికారుల సామర్థ్యాలను పెంపొందించడం అనే లక్ష్యంతో రూపొందించబడింది. ఎందుకంటే పెరుగుతున్న ముప్పును ఎదుర్కోవడానికి తగిన భద్రతా చర్యలను నిర్ధారించడం కోసం సంస్థలు తమ డిజిటల్ మౌలిక సదుపాయాలను రక్షించుకోవాలి మరియు భవిష్యత్తులో సైబర్-దాడులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి.

డీప్-డైవ్ శిక్షణ ప్రత్యేకంగా సిఐఎస్ఓలకు సైబర్ దాడులను సమగ్రంగా మరియు క్షుణ్ణంగా అర్థం చేసుకోవడం, రక్షణకు సంబంధించినతాజా సాంకేతికతలు మరియు వ్యక్తిగత సంస్థలకు మరియు పౌరులకు ఒక స్థితిస్థాపక ఇ-ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రయోజనాలను అనువదించడం కోసం ప్రత్యేకంగా ఉద్దేశించబడింది.

ఈ శిక్షణ చట్టపరమైన నిబంధనలకు సమగ్ర వీక్షణను అందించడం, సైబర్ సెక్యూరిటీ డొమైన్‌లో విధానాలను రూపొందించడానికి మరియు నిర్దిష్ట సైబర్ సంక్షోభ నిర్వహణ ప్రణాళికలను రూపొందించడానికి సిఐఎస్ఓలను అనుమతిస్తుంది.

కార్యక్రమాన్ని ఎన్ఐసి బిబి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ శ్రీ ఆర్ఎస్ మణి మరియు ఎన్ఇజీడి, ఎంఇఐటివై, ఐఐపిఏ సీనియర్ అధికారులు ప్రారంభించారు.

ఈ శిక్షణా కార్యక్రమం పరిశ్రమ, విద్యాసంస్థ మరియు ప్రభుత్వం నుండి విషయ నిపుణులను ఒకచోట చేర్చి సైబర్ భద్రతకు సంబంధించిన కీలక డొమైన్ సమస్యలు, గవర్నెన్స్ రిస్క్, కంప్లయన్స్, భారతదేశంలోని సైబర్ సెక్యూరిటీ ఉత్పత్తుల ల్యాండ్‌స్కేప్, ఎండ్ పాయింట్ ఉ డిజిటల్ వర్క్‌ప్లేస్ సెక్యూరిటీ, నెట్‌వర్క్ సెక్యూరిటీ, అప్లికేషన్ మరియు డేటా సెక్యూరిటీ, సిసిఎంపి ఉ ఇన్సిడెంట్ రెస్పాన్స్, మొబైల్ సెక్యూరిటీ, క్రిప్టోగ్రఫీ, సైబర్ సెక్యూరిటీ టెస్టింగ్ మరియు ఆడిట్, సైబర్ సెక్యూరిటీ సంబంధిత ప్రొవిజన్స్ ఆఫ్ ఐటీ యాక్ట్ మరియు ఐఎస్ఎంఎస్ స్టాండర్డ్స్,ఐఎస్ఓ 27001, సెక్యూరిటీ లాగింగ్ మరియు ఆపరేషన్ ఉ మానిటరింగ్ ఆఫ్ సెక్యూరిటీ ఆపరేషన్ సెంటర్ అంశాలపై చర్చిస్తుంది.

2018లో ప్రారంభించబడిన సిఐఎస్ఓ శిక్షణ అనేది పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) మోడల్‌లో ప్రభుత్వం మరియు పరిశ్రమల కన్సార్టియం మధ్య మొదటి-రకం భాగస్వామ్యం. జూన్ 2018 నుండి మే 2023 వరకు ఎన్ఇజీడి 1,419 కంటే ఎక్కువ సిఐఎస్ఓలు మరియు ఫ్రంట్‌లైన్ ఐటీ అధికారుల కోసం 36 బ్యాచ్‌ల సిఐఎస్ఓ డీప్-డైవ్ శిక్షణా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించింది.

# వాణిజ్యం, పెట్టుబడులపై జరగనున్న 6వ భారత్- కెనడా మంత్రుల స్థాయి సమావేశంలో పాల్గొనడానికి కెనడాలో పర్యటించనున్న పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, మే 9: వాణిజ్యం, పెట్టుబడులపై ఈరోజు ఒట్టావా లో జరగనున్న 6వ భారత్- కెనడా మంత్రుల స్థాయి సమావేశానికి కెనడా అంతర్జాతీయ వాణిజ్యం, ఎగుమతి ప్రోత్సాహం, చిన్న వ్యాపారం, ఆర్థికాభివృద్ధి శాఖ మంత్రి మేరీ ఎన్‌జి తో కలిసి కేంద్ర వాణిజ్యం, పరిశ్రమలు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం , ప్రజా పంపిణీ, జౌళి శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ సహ అధ్యక్షత వహించనున్నారు. సమావేశంలో వాణిజ్యం , పెట్టుబడులకు సంబంధించిన వివిధ అంశాలు, రెండు దేశాల మధ్య పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలు చర్చకు రానున్నాయి. భారతదేశం, కెనడా దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలు బలోపేతం చేయడం, పెట్టుబడి ప్రోత్సాహం, సహకారం, హరిత ఇంధన వినియోగం, ముఖ్యమైన ఖనిజాలు లాంటి రంగాల్లో రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత పటిష్టం చేయడానికి చర్చలు, బి2బి సమావేశాలు నిర్వహించడం సహా పలు అంశాలపై చర్చలు జరగనున్నాయి.

భారత్-కెనడా దేశాల మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం కోసం జరుగుతున్న చర్చల పురోగతిని కూడా మంత్రులు సమీక్షిస్తారు. 2022 మార్చిలో జరిగిన మంత్రుల స్థాయి సమావేశంలో సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై రెండు దేశాల మంత్రుల మధ్య చర్చలు జరిగాయి. రెండు దేశాల మధ్య మధ్యంతర ఒప్పందం లేదా ఇఖుం (ఎర్లీ ప్రోగ్రెస్ ట్రేడ్ అగ్రిమెంట్) కుదిరే అవకాశంపై దృష్టి సారించారు. దీనికి సంబంధించి రెండు దేశాల మధ్య ఆరు సార్లు చర్చలు జరిగాయి.

2023 మే 9,10 తేదీల్లో శ్రీ గోయల్ టొరంటో లో పర్యటిస్తారు. వాణిజ్యం, పెట్టుబడులపై శ్రీ గోయల్ వివిధ సమావేశాల్లో పాల్గొంటారు. కెనడాకు చెందిన ప్రముఖ సంస్థల సీఈఓలు, కెనడా కేంద్రంగా పనిచేస్తున్న భారతదేశం,కెనడా దేశాలకు చెందిన సంస్థల సీఈవోలు పాల్గొనే చర్చల్లో ఆర్థిక అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తారు. ఫిక్కీ కి చెందిన సీఈవోలు మంత్రితో కలిసి చర్చల్లో పాల్గొంటారు.

# వ్యవస్థలో మార్పు కోసమే 'జగనన్నకు చెబుదాం'

అమరావతి, మే 9:వ్యవస్థలో మార్పు తీసుకొచ్చేందుకే 'జగనన్నకు చెబుదాం' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైయస్ జగన్ లాంఛనంగా ప్రారంభించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం కోసం ప్రత్యేకంగా 1902 టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశారు. ప్రతి వినతి పరిష్కారమయ్యే వరకూ ట్రాకింగ్ చేస్తారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలను పొందడంలో ఎలాంటి సమస్యలున్నా తెలియచేయవచ్చన్నారు. సంక్షేమ పథకాలు, వైయస్ఆర్ పెన్షన్ కానుక, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ సేవలు పొందడంలో ఏమైనా అవాంతరాలు ఎదురైతే రైతన్నలు, అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, మరెవరైనా సరే 1902కు ఫోన్ చేసిన వారి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు.

రెవెన్యూ రికార్డులకు సంబంధించి ఏవైనా సమస్యలున్నా, ప్రభుత్వ సేవలకు సంబంధించి మరే ఇతర ఇబ్బందులున్నా జగనన్నకు చెబుదాం ద్వారా పరిష్కారం కోసం 1902 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలన్నారు. ఐవీఆర్ఎస్, ఎస్ఎంఎస్ ద్వారా పౌరులు ఎప్పటికప్పుడు తమ ఫిర్యాదుల స్థితి, పరిష్కారం గురించి తెలుసుకునే వీలుందన్నారు. ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్లతో పాటు నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం పర్యవేక్షిస్తుందన్నారు.

# కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అధ్యక్షతన సైన్స్ మంత్రిత్వ శాఖలు, విభాగాల ఉన్నత స్థాయి సంయుక్త సమావేశం



న్యూఢిల్లీ, మే 9:సమిష్టి పని విధానాన్ని అభివృద్ధి చేయడానికి వివిధ శాస్త్రీయ అంశాల ఆలోచనా పరంపరలను ఒకే తాటిపైకి తేవాలని కేంద్రం సంకల్పించింది. దీనిలో భాగంగానే ఆయా విభాగాల ఉమ్మడి సమావేశానికి కేంద్ర సైన్స్ ఉ టెక్నాలజీ (స్వతంత్ర బాధ్యత); ఎర్త్ సైన్సెస్; పీఎంఓ, పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, పెన్షన్స్, అటామిక్ ఎనర్జీ, స్పేస్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అధ్యక్షతన సైన్స్, టెక్నాలజీ, బయోటెక్నాలజీ, సిఎస్ఐఆర్, ఎర్త్ సైన్సెస్, స్పేస్, అటామిక్ ఎనర్జీతో సహా సైన్స్ మంత్రిత్వ శాఖలు, విభాగాల ఉన్నత స్థాయి సంయుక్త సమావేశం జరిగింది. ఈ సంవత్సరం అన్ని సైన్స్ మంత్రిత్వ శాఖలు, విభాగాలు సంయుక్తంగా 2023 మే 11న జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని జరుపుకుంటాయని కేంద్ర మంత్రి చెప్పారు.

ఇది ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సూచించిన మొత్తం ప్రభుత్వ విధానానికి అనుగుణంగా ఉందని, మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయంతో పనిచేయడంపై ఎప్పటికప్పుడు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, భారతదేశంలో మే 11న జరుపుకునే జాతీయ సాంకేతిక దినోత్సవంలో మన దేశంలో సాంకేతిక రంగంలో టెక్ దిగ్గజాలు, పరిశోధకులు, ఇంజనీర్ల విజయాలను ప్రముఖంగా ప్రస్తావన ఉంటుందని అన్నారు. ఈ సంవత్సరం, జాతీయ సాంకేతిక దినోత్సవం ఇతి వృత్తం "అటల్ టింకరింగ్ ల్యాబ్స్", ఇది 2016లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో పాఠశాల, బోధనా సంస్థల స్థాయిలో జోక్యం ద్వారా ఇన్నోవేషన్ స్టార్టప్‌లు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లను ప్రోత్సహించడానికి చేపట్టిన మార్గనిర్దేశక కార్యక్రమం యువకులలో మరింత ఉత్సాహాన్ని నింపనున్నది.

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం చేపట్టిన గొప్ప సంస్కరణల వల్ల గత 9 ఏళ్లలో భారతదేశం సాంకేతిక పురోగతిలో అద్భుతమైన వృద్ధిని సాధించిందని మంత్రి ఉద్ఘాటించారు. శాస్త్రవేత్తలు మరియు ఇంజనీర్ల కృషిని అభివృద్ధి చోదకులుగా గుర్తించడానికి జాతీయ సాంకేతిక దినోత్సవం సరైన సందర్భమని ఆయన అన్నారు.

మే 11న నిర్వహించనున్న జాతీయ సాంకేతిక దినోత్సవ సన్నాహాల సమీక్షతో పాటు, నేటి సమావేశంలో అజెండాగా అవార్డుల హేతుబద్ధీకరణ, సైన్స్ మీడియా కమ్యూనికేషన్ సెల్ (ఎస్ఎంసిసి) ఏర్పాటుపై తాజా పరిస్థితి, ప్రాజెక్టులలో నియామకం కోసం సాంకేతిక సిబ్బంది వయస్సులో సడలింపుపై సమీక్ష జరిగింది.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, సైన్స్ మీడియా కమ్యూనికేషన్ సెల్ (ఎస్ఎంసిసి) అమల్లోకి వచ్చిన తర్వాత, భారతదేశ వైజ్ఞానిక నైపుణ్యం గురించి అన్ని వాటాదారులకు సాధారణ అవగాహన కల్పించడానికి అన్ని విభాగాల విజయగాథలను సంకలనం చేసి సాధారణ ప్రజలకు ప్రచారం చేయాలన్నారు. అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాలు ప్రాంతీయ భాషలలో సమాచారాన్ని వ్యాప్తి చేయడానికి, సృజనాత్మక కంటెంట్ రూపకల్పన, సైన్స్ ఉ టెక్నాలజీకి సంబంధించిన రోజువారీ వార్తల బులెటిన్‌ల తయారీలో నిమగ్నమవ్వడానికి కలిసి పనిచేయాలని ఆయన ఆదేశించారు.

ఈ సమావేశానికి కేంద్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్, సైన్స్, టెక్నాలజీ, బయోటెక్నాలజీ, సిఎస్ఐఆర్, ఎర్త్ సైన్సెస్, స్పేస్, అటామిక్ ఎనర్జీతో సహా సైన్స్ విభాగాలు, డిపార్ట్‌మెంట్‌ల సెక్రటరీలు హాజరయ్యారు.



# నేడు రాజస్థాన్‌ను సందర్శించనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, మే 9:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మే నెల 10 వ తేదీ న రాజస్థాన్ ను సందర్శించనున్నారు. ఉదయం పూట సుమారు 11 గంటల వేళ కు ప్రధాన మంత్రి నాథ్ ద్వారా లో శ్రీనాథ్ జీ ఆలయానికి వెళ్తారు. ఇంచుమించు 11 గంటల 45 నిమిషాల వేళ కు ఆయన నాథ్ ద్వారా లో వివిధ అభివృద్ధి కార్యక్రమాల ను దేశ ప్రజల కు అంకితమివ్వడం తో పాటుగా శంకుస్థాపన చేస్తారు. ఆ తరువాత, మధ్యాహ్నం సుమారు 3 గంటల 15 నిమిషాల వేళ కు ప్రధాన మంత్రి ఆబూ రోడ్ లో గల బ్రహ్మ కుమారీ ల శాంతివన్ భవన సముదాయాని కి వెళ్తారు.

ప్రధాన మంత్రి 5500 కోట్ల రూపాయల కు పైగా విలువ కలిగిన ప్రాజెక్టుల ను దేశ ప్రజల కు అంకితమివ్వడం మరియు శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు ల ప్రధానోద్దేశ్యాలు ఆ ప్రాంతం లో మౌలిక సదుపాయాల ను పెంపొందించడమూ, సంధానాన్ని అధికం చేయడమూను. రహదారులు మరియు రేల్ వే రంగం లోని ప్రాజెక్టుల తో సరకుల మరియు సేవల రాక పోక లు సౌకర్యవంతం గా మారుతాయి. తద్వారా వ్యాపారానికి మరియు వాణిజ్యాని కి ప్రోత్సాహం లభిస్తుంది; అంతేకాక, ఆ ప్రాంతం ప్రజల సామాజిక స్థితిగతులు, ఆర్థిక స్థితి మెరుగు పడతాయి.

రాజ్ సమంద్ లో మరియు ఉ దయ్ పుర్ లో రెండు దోవ లు ఉ ండేటటువంటి రహదారి నిర్మాణ పథకాల కు ప్రధాన మంత్రి శంకుస్థాపన చేయనున్నారు.

ప్రజల కు మరింత ఉ న్నతమైనటువంటి సౌకర్యాల ను అందించడం కోసం తలపెట్టిన ఉ దయ్ పుర్ రేల్ వే స్టేశన్ యొక్క పునరభివృద్ధి పనుల కు ప్రధాన మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. గేజ్ మార్పిడి పథకాని కి మరియు రాజ్ సమంద్ లోని నాథ్ ద్వారా నుండి నాథ్ ద్వారా పట్టణం వరకు ఒక క్రొత్త మార్గాన్ని వేసే పనులకు కూడాను ప్రధాన మంత్రి శంకుస్థాపన చేయనున్నారు.

దీనికి అదనం గా, ప్రధాన మంత్రి మూడు జాతీయ రాజమార్గ పథకాల ను దేశ ప్రజల కు అంకితం చేయనున్నారు; వాటి లో ఎన్ హెచ్-48 లో భాగం అయినటువంటి ఉదయ్ పుర్ నుండి శ్యామలాజీ వరకు 114 కి.మీ. పొడవైనటువంటి ఆరు దోవ ల ప్రాజెక్టు, ఎన్ హెచ్-25 లోని బార్-బిలారా-జోధ్ పుర్ సెక్శన్ లో ద్విచక్ర వాహనాల కోసం రహదారి ని వెడల్పు చేసే (పేవ్ శోల్డర్) తో కూడిన 110 కి.మీ. పొడవైన రాదారి ని నాలుగు దోవల ను కలిగి ఉండేది గా విస్తరించేమరియు పటిష్ట పరచే ప్రాజెక్టు, ఇంకా ఎన్ హెచ్-58ఇ లో పేవ్డ్ శోల్డర్ సెక్శన్ కలుపుకొని 47 కి.మీ. పొడవు ను కలిగిన రెండు లేన్ లతో కూడివుండే రహదారి నిర్మాణం ప్రాజెక్టు లు భాగం గా ఉ న్నాయి.

బ్రహ్మ కుమారీ ల శాంతివన్ కాంప్లెక్స్ లో ప్రధాన మంత్రి

దేశవ్యాప్తం గా ఆధ్యాత్మిక పునర్ జాగరణ కు వేగాన్ని ఇవ్వాలనే అంశం పై ప్రధాన మంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటున్నారు. ఇదే ప్రయాస ను ప్రధాన మంత్రి ముందుకు తీసుకు పోతూ, బ్రహ్మకుమారీ ల కు చెందిన శాంతివన్ భవన సముదాయాన్ని సందర్శించనున్నారు. ఆయన ఒక సూపర్ స్పెశలిటీ చారిటబల్ గ్లోబల్ హాస్పిటల్ కు, శివమణి వృద్ధాశ్రమం రెండో దశ కు మరియు నర్సింగ్ కాలేజీ విస్తరణ కు శంకుస్థాపన చేయనున్నారు. సూపర్ స్పెశలిటీ చారిటబల్ గ్లోబల్ హాస్పిటల్ ను ఆబూ రోడ్ లో ఏభై ఎకరాల క్షేత్రం లో ఏర్పాటు చేయడం జరుగుతుంది; అది ప్రపంచ స్థాయి చికిత్స సదుపాయాల ను అందుబాటు లోకి తీసుకు రావడం తో పాటుగా ఆ ప్రాంతం లోని పేదల కు మరియు ఆదివాసీల కు ప్రత్యేకించి ప్రయోజనకరం గా ఉండగలదు.

## ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న సి.ఎం. కప్-2023 క్రీడా పోటీలకు పకడ్బందీ ఏర్పాటు

హైదరాబాద్, మే9:ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న సి.ఎం. కప్-2023 క్రీడా పోటీలకు మండల, జిల్లా స్థాయిలో పకడ్బందీ ఏర్పాట్లు చేయవలసినదిగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ రోహిణి ప్రియదర్శినితో కలిసి క్రీడా పోటీల నిర్వహణ, ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల స్థాయిలో కోకో, కబడ్డీ, వాలి బాల్, ఫుట్ బాల్ , అథ్లెటిక్స్ పోటీలను ఈ నెల 15 నుండి 17 వరకు నిర్వహించనున్నామని, ఈ పోటీలలో 15 నుండి 36 సంవత్సరాలలోపు పురుష, మహిళా అభ్యర్థులు పాల్గొనవచ్చని వారు తెలిపారు. క్రీడల నిర్వహణ కోసం మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేశామని ఆ కమిటీలు క్రీడా పోటీలు నిర్వహించే అనుకూల ప్రదేశాలు గుర్తించి తగు ఏర్పాట్లు చేసేలా పర్యవేక్షించవలసినదిగా మండల పరిషద్ అభివృద్ధి అధికారులకు సూచించారు. ఈ టోర్నమెంట్ లో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని అన్నారు. క్రీడా పోటీల నిర్వహణకు దాతల నుండి, లేదా సి.ఎస్.ఆర్. నుండి నిధులు సేకరిస్తూ పకడ్బందీగా క్రీడలు నిర్వహించేలా పర్యవేక్షణ చేయవలసినదిగా మండల ప్రత్యేకాధికారులకు సూచించారు. మండల మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులతో పాటు జిల్లా స్థాయిలో ఈ నెల 22 నుండి 24 వరకు 11 అంశాలలో.. అథ్లెటిక్స్, ఫుట్ బాల్., బాస్కెట్ బాల్, బాక్సింగ్, కుస్తీ ప్లోటీలు ఇందిరా గాంధీ స్టేడియం నందు, కబడ్డీ, ఖో ఖో , వాలి బాల్ పోటీలు ప్రభుత్వ జూనియర్ కళాశాల పెనగణంలో, బ్యాట్మింటన్ పోటీలు ఫై.ఎస్.ఆర్. ఇండోర్ స్టేడియం నందు, హ్యాండ్ బాల్ పోటీలు టి.యస్.ఆర్.యస్. పాఠశాల నందు, స్విమింగ్ పోటీలు నిర్వహించనున్నామని అన్నారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు కప్, పాల్గొనే ప్రతి క్రీడాకారునికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందించనున్నామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషద్ సీఈఓ వెంకట శైలేష్, జిల్లా యువజన అధికారి నాగరాజ్, జిల్లా విద్యా శాఖాధికారి రాధాకిషన్, మెదక్, రామాయంపేట మునిసిపల్ కమిషనర్లు జానకి రామ్ సాగర్, ఉ మాదేవి, జిల్లా పరిశ్రమల అధికారి కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# మే 31న కొమురవెల్లిలో మున్నూరు కాపుసత్రం భూమి పూజ

## - పోస్టర్‌ను ఆవిష్కరించిన రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య




హైదబాద్ మే 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ఈ నెల 31 న కొమురవెల్లి లో మున్నూరు కాపుసత్రం భూమి పూజ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నటు శ్రీ మల్లికార్జున స్వామి మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్ర భవనం వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పు రవీందర్ పటేల్ తెలిపారు.ఈ మేరకు హైదరాబాద్లోని బిసి భవన్ లో మున్నూరు కాపుసత్రం భూమి పూజ వాల్ పోస్టర్ ను రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య,ఎర్ర సత్యనారాయణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఈ మహా కార్యానికి రావసిన్దిగా ఆర్ కృష్ణయ్య ఆహ్వానించారు అనంతరం ఉప్పు రవీందర్ పటేల్ మాట్లాడుతూ కాశీ పీఠం పీఠాతీస్వర్లు పరమహంస పరి వ్రజకాచార్య శ్రీ శ్రీ శ్రీ శివ నాగేంద్ర సరస్వతి స్వామిజీ మహాస్వామిజీ చేతుల మీదుగా ఈ భూమి పూజా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి మున్నూరు కాపు కుల బంధువులను ప్రతి ఒక్కరిని కలిసి ఆహ్వానించడం జరిగినదని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆకుల.రాజయ్య పటేల్, మొగిలి దుర్గ ప్రసాద్ పటేల్, గూడెపు ప్రవీణ్ పటేల్, ఎడ్ల సురేందర్ పటేల్, మారిశెట్టి మురళి పటేల్,స్వామి వివేక్ పటేల్ కాముని రమేష్ పటేల్, మురళి పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# నానమ్మ బాటలో ప్రియాంకా.. తెలంగాణా నుండి పోటీ

హైదరాబాద్ మే 9 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ తెలంగాణ నుంచి పోటీ చేస్తున్నారా..? రాష్ట్రంలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా ఇక్కడ్నుంచే పోటీచేయాలని ఫిక్స్ అయ్యారా..? అప్పుడే రెండు నియోజకవర్గాలను కూడా పెద్దలు ఎంపిక చేసేశారా..? నాడు ఇందిరాగాంధీ తెలంగాణ నుంచి పోటీచేయగా.. నానమ్మ అడుగుజాడల్లో నడవాలని నేడు ప్రియాంక ప్రయత్నాలు చేస్తున్నారా..? అంటే కాంగ్రెస్ వీరాభిమానులు అవుననే అంటున్నారు. ఇందులో నిజమెంత..? ఒకవేళ పోటీచేస్తే ఎక్కడ్నుంచి బరిలోకి దిగొచ్చు..? తెలంగాణ పర్యటన ముగించుకున్న గంటల వ్యవధిలోనే ప్రియాంక గురించి ఈ టాక్ ఎందుకు వస్తోంది..? తెలంగాణలో గులాబీ పార్టీ హ్యాట్రిక్ కొట్టకూడదు.. ఎట్టి పరిస్థితుల్లో, ఏం చేసైనా సరే కేసీఆర్‌ను గద్దె దించాల్సిందే.. బీఆర్ఎస్ కారుకు బ్రేక్‌లు వేసి చావు దెబ్బ రుచి చూపించాలి.. ఇదే కాంగ్రెస్, బీజేపీ పార్టీల ముందున్న ముందున్న ఏకైక లక్ష్యం. ఇందుకు ఇరు పార్టీలు శక్తికి మించి మరీ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఢిల్లీ పెద్దలు మోదీ, అమిత్ షా డైరెక్షన్‌లో కమలనాథులు.. ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్, గాంధీ కుటుంబం చరిష్మాతో పూర్వవైభవం తీసుకొచ్చి అధికారంలోకి రావాలని నేతలు తహతహలాడుతున్నారు. సరిగ్గా ఇదే టైమ్‌లో తెలంగాణ నుంచే ప్రియాంక గాంధీని పోటీ చేయించాలనే యోచనలో కాంగ్రెస్ పెద్దలు ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ విషయాన్ని తెలంగాణ నేతలు.. సోనియా గాంధీ రాహుల్ గాంధీలకు చెవిన వేసినట్లు తెలుస్తోంది. ఎక్కడ్నుంచి పోటీ చేయించవచ్చు..? ఎంపీ అయితే బాగుంటుందా..? ఎమ్మెల్యే అయితే బాగుంటుందా..? అని సమాలోచనలు కూడా చేశారట. ఇందుకు రెండు నియోజకవర్గాలను ఎంపిక చేశామని.. ఎంపీగా అయితేనే కరెక్ట్‌గా ఉంటుందని వివరించారట. మహబూబ్‌నగర్ లేదా మెదక్ నుంచి పోటీ చేయించాలని ఏఐసీసీ భావిస్తున్నట్లు ఇటు తెలంగాణలో.. అటు ఢిల్లీ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. ప్రియాంకను తెలంగాణ రాజకీయాల్లోకి తీసుకురావడం వల్ల ఇక్కడ రాజకీయ సమీకరణలు మార్చవచ్చన్నది టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మాస్టర్ ప్లానట. ఒక్కమాటలో చెప్పాలంటే.. ప్రియాంకను 'ఫేస్ ఆఫ్ ది తెలంగాణ కాంగ్రెస్' అని రాష్ట్ర నేతలు భావిస్తున్నారట.

**ఢిల్లి నేతల చూపు తెలంగాణా వైపు**

కర్ణాటకలో కాంగ్రెస్‌కు విజయావకాశాలు ఉన్నాయని అగ్రనేతలు గట్టిగా నమ్ముతున్నారు. మరోవైపు బీజేపీ కూడా కచ్చితంగా కాషాయ జెండా ఎగరేస్తామని కమలనాథులు ధీమాగా చెబుతున్నారు.

ఇక్కడ ఎన్నికలు పూర్తవ్వగానే ఈ రెండు పార్టీలకు టార్గెట్ తెలంగాణ మాత్రమే. అక్కడ.. ఇక్కడ తాడేపేడో తేల్చుకోవాలని జాతీయ పార్టీలు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. ఇందులో భాగంగానే జాతీయ స్థాయి నేతలు తెలంగాణ నుంచి బరిలోకి దిగాలని భావిస్తున్నారట. ఇప్పటికే ప్రధాని మోదీ మహబూబ్‌నగర్ నుంచి పోటీచేస్తారని పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. ఆ తర్వాత సోనియాగాంధీ కూడా మల్కాజిగిరి నుంచి పోటీచేస్తారని ఆ మధ్య ప్రచారం జరిగింది. ఇప్పుడు ఏకంగా ప్రియాంక గాంధీ గురించి వార్తలు గుప్పుమంటున్నాయి. మెదక్ లేదా మహబూబ్‌నగర్ నుంచి పోటీచేసే ఛాన్స్ ఉందని కాంగ్రెస్ వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఎమర్జెన్సీ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న ఇందిరాగాంధీ 1980లో మెదక్ నుంచి ఎంపీగా పోటీచేసి విజయకేతనం ఎగురవేశారు. అప్పటికే అత్యవసర పరిస్థితితో విమర్శలపాలైన ఇందిరమ్మను మెదక్ ప్రజలు అక్కున చేర్చుకోవడంతో ఈ విజయం పెను సంచలనమే అయ్యింది. అందుకే నాన్నమ్మ బాటలో.. ఇక్కడ్నుంచే ప్రియాంకను పోటీ చేయిస్తే కాంగ్రెస్‌కు కలిసొస్తుందని ఏఐసీసీ ప్లాన్ చేస్తోందట. బీజేపీని ఢీ కొట్టలేక చతికిలపడుతున్న కాంగ్రెస్‌కు ప్రియాంక రూపంలో ఊపిరిపోయాలని హైకమాండ్ అనుకుంటోందట.

అంతా ముందస్తుగానే..!

ప్రియాంక గాంధీ తెలంగాణ పర్యటించడం పక్కా వ్యూహమేనట. రానున్న రోజుల్లో తెలంగాణ ఇంచార్జ్‌గా నియమించినా పెద్దగా ఆశ్చర్యపోనక్కర్లేదట. సరూర్‌నగర్ పర్యటన జస్ట్ శాంపిల్ మాత్రమేనని.. ముమ్మందు ఇక నెలలో రెండుసార్లు రాష్ట్రంలో పర్యటించేలా హైకమాండ్ ప్లాన్ చేస్తోందట. ఇప్పుడు యువత, నిరుద్యోగులు.. రానున్న రోజుల్లో రైతులు, ఆ తర్వాత ఉద్యమకారుల ఇలా ఒక్కో పర్యటనలో ఒక్క వర్గానికి సంబంధించి సభ ఉండబోతోందట. అయితే.. ఇటు ఇంచార్జ్.. అటు తెలంగాణ నుంచి పోటీ ఇవన్నీ ఒక్కసారిగా వార్తలు రావడంతో అసలు ఇందులో ఏది నిజమో తెలియక కార్యకర్తలు, వీరాభిమానులు తికమకపడుతున్నారు. వాస్తవానికి ప్రియాంక ఇదిగో ఫలానా చోటు నుంచి పోటీచేస్తారని వార్తలు ప్రతిసారి వస్తున్నాయే తప్పితే ప్రత్యక్ష ఎన్నికల్లో ఆమె ఎప్పుడూ బరిలోకి దిగలేదు. బాధ్యతలు మాత్రం పెద్దవే ఉన్నప్పటికీ పోటీ మాత్రమే ఎక్కడా చేయలేదు. ఇప్పుడు యువనేత రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేసిన తర్వాత కాంగ్రెస్‌కు ఉన్న ఏకైక ఆప్షన్ ప్రియాంకేనని కార్యకర్తలు, వీరాభిమానులు చెప్పుకున్నారు. రానున్న ఎన్నికల్లో అది కూడా వయనాడ్ నుంచి ప్రియాంక పోటీచేస్తారని వార్తలు వచ్చాయి. అయితే ఇంతవరకూ ఆ ఊసేలేదు. ఒకవేళ పోటీచేయాల్సి వస్తే వయనాడ్, తెలంగాణ నుంచి ఒక స్థానంలో.. రెండుచోట్లా పోటీచేయించాలనేది హైకమాండ్ ప్లానట. ఆడబిడ్డ పైగా ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన పార్టీగా.. ఇందిరమ్మను ప్రియాంక రూపంలో చూసుకుని జనాలు గెలిపిస్తారని రాష్ట్ర పెద్దలు ధీమాతోనే ఉన్నారట.మొత్తానికి చూస్తే.. కర్ణాటక ఎన్నికల తర్వాత తెలంగాణలో రాజకీయ పరిణామాలు భారీగానే మారిపోతాయని స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. మరి ప్రియాంక తెలంగాణ నుంచి పోటీ అనేది ప్రచారంగానే మిగిలిపోతుందా లేకుంటే పోటీచేసి కాంగ్రెస్‌కు ఊపిరిపోసి అధికారంలోకి తీసుకొస్తారా..? అనేది తెలియాల్సి ఉంది. ఒకవేళ ఇదే నిజమైతే మాత్రం బీజేపీ నుంచి జాతీయ నేతలు కచ్చితంగా బరిలోకి దిగుతారు.. ఇక బీఆర్ఎస్ ఏం చేస్తుందో.. ఎన్నికల ముందు ఇంకా ఎన్నెన్ని పరిణామాలు చోటుచేసుకుంటాయో వేచి చూడాల్సిందే మరి.

# కర్ణాటక సార్వభౌమాధికారం వ్యాఖ్యలపై సోనియాను వివరణ కోరిన ఈసి

న్యూఢిల్లీ మే 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: కర్ణాటక ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ చేసిన కర్ణాటక సార్వభౌమాధికారంవ్యాఖ్యలపై భారతీయ జనతా పార్టీ ఫిర్యాదు మేరకు కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. ఈ విషయంలో వివరణ ఇవ్వాలంటూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని కోరింది.అంతకు ముందు సోనియాగాంధీ తన ప్రసంగంలో 'సార్వభౌమాధికారం' అనే పదాన్ని ఉపయోగించడంపై అభ్యంతరం తెలిపిన బీజేపీ ఎంపీలు... ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఈసీఐని బీజేపీ ప్రతినిధి బృందం కోరింది.కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ కర్ణాటక ప్రతిష్ట, సార్వభౌమాధికారం, సమగ్రతకు ముప్పుగా పరిణమించే ఎవరినీ కాంగ్రెస్ పార్టీ ఉపేక్షించదని కాంగ్రెస్ పార్టీ మే 6న ఒక ట్వీట్ చేసింది. ఈ వ్యాఖ్యలపై బీజేపీతో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మండిపడ్డారు. సోనియాగాంధీ 'సార్వభౌమాధికారం' అనే పదాన్ని ఉద్దేశపూర్వకంగానే వాడినట్టు కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ విమర్శించారు. ఆమెపై ఈసీ చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ శోభా కరంద్లాజే సైతం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. సార్వభౌమాధికారం పదాన్ని దేశానికి మాత్రమే ఉపయోగిస్తారని, సోనియాగాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

# 2023 ఏప్రిల్ నెలలో 126.46 ఎంటీల సరకు రవాణాతో రికార్డ్ సృష్టించిన రైల్వే శాఖ

న్యూఢిల్లీ, మే 9:2023 ఏప్రిల్ నెలలో, నెలవారీ సరకు రవాణాలో 126.46 ఎంటీల రవాణాతో రైల్వే శాఖ రికార్డ్ సృష్టించింది. 2022 ఏప్రిల్ గణాంకాలతో పోలిస్తే 2023 ఏప్రిల్ నెలలో పెరిగిన లోడింగ్ 4.25 ఎంటీలు పెరిగింది, ఇది 3.5% వృద్ధి. 2022 ఏప్రిల్‌లోని సరకు రవాణా ఆదాయం రూ.13,011తో పోలిస్తే, 2023 ఏప్రిల్‌లో రూ.13,893 కోట్లు ఆర్జించింది, ఇది 7% వృద్ధి.

బొగ్గు రవాణాలో 2022 ఏప్రిల్‌లోని 58.35 ఎంటీలతో పోలిస్తే, 2023 ఏప్రిల్‌లో 62.39 ఎంటీల లోడ్ సాధించింది,. ఆ తర్వాత ఇనుప ఖనిజం 14.49 ఎంటీలు, సిమెంట్ 12.60 ఎంటీలు, ఇతర సరుకులు 9.03 ఎంటీలు, ఉక్కు 5.64 ఎంటీలు, ఆహార ధాన్యాలు 5.11 ఎంటీలు, ఖనిజ నూనెలు 4.05 ఎంటీలు, ఎరువులు 3.90 ఎంటీలు రవాణా చేసింది.

"హంగ్రీ ఫర్ కార్గో" నినాదంతో సులభతర వ్యాపారం కోసం, పోటీ ధరలతో డెలివరీ సేవలు అందించడానికి రైల్వే శాఖ నిరంతర ప్రయత్నాలు చేసింది. ఫలితంగా, సాంప్రదాయ ఉ సాంప్రదాయేతర సరకు రవాణాలో కొత్త ఆర్డర్లు వస్తున్నాయి.

# రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునేదిలేదు

## - కఠిన చర్యలు తప్పవు:కలెక్టర్ గౌతమ్



ఖమ్మం, మే9: (నేటినిజం ప్రతినిధి): జిల్లాలోని పెనుబల్లి మండలం అరిసెల్లపాడు గ్రామంలోని శ్రీలక్ష్మి శ్రీనివాస పారా బాయిల్డ్ రైస్ మిల్లును సీజ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు.ధాన్య సేకరణలో భాగంగా మిల్లుకు కేటాయించిన ధాన్యం తీసుకోకుండా,తరుగు పేరిట రైతులను ఇబ్బంది పెట్టడం,స్వంతంగా ధాన్యం కొనుగోలు చేసి,అట్టి ధాన్యానికి సంబంధించి రిజిస్టర్ల తనిఖీ అధికారులకు చూపకపోవడం,అధికార యంత్రాంగం సూచనలు పెడచెవిన పెట్టడంతో రైస్ మిల్లును సీజ్ చేసినట్లు ఆయన అన్నారు.

జిల్లాలో 64 రైస్ మిల్లులు ఉన్నట్లు,జిల్లా వ్యాప్తంగా 232 ధాన్య కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి, సేకరించిన ధాన్యాన్ని కేంద్రాలకు దగ్గరలోని రైస్ మిల్లులకు ట్యాగ్ చేసినట్లు ఆయన తెలిపారు. మిల్లుల ద్వారా ధాన్య సేకరణ సజావుగా జరుగుతున్నట్లు,కొన్ని మిల్లులు తరుగు పేరిట రైతులకు ఇబ్బందులు కల్గిస్తున్నట్లు దృష్టికి వచ్చిందన్నారు. ధాన్య సేకరణకు ఆటంకం కలిగిస్తే ఉపేక్షించబోమని,తరుగు పేరిట,అన్లోడ్ పేరిట రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదని, కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

## జి.ఓ. 59 క్రింద క్రమబద్దీకరణ కొరకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు డబ్బులు చెల్లించిన వెంటనే క్రమబద్దీకరించుటకు ప్రభుత్వం సిద్ధం ఉంది

మెదక్, మే9: (నేటినిజం ప్రతినిధి):జి.ఓ. 59 క్రింద క్రమబద్దీకరణ కొరకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు డబ్బులు చెల్లించిన వెంటనే క్రమబద్దీకరించుటకు ప్రభుత్వం సిద్ధం ఉందని, లబ్దిదా రులు ఈ చక్కటి అవకాశాన్ని వినియోగిచుకోవ లసినది గా అదనపు కలెక్టర్ రమేష్ సూచించారు. మంగళవారం నర్సాపూర్ ఆర్.డి.ఓ. కార్యాలయంలో నర్సాపూర్, మనోహరాబాద్ మండలాలకు చెందిన లబ్ధిదారులతో మాట్లాడుతూ జి.ఓ. 59 క్రింద క్రమబద్దీకరణకు డిమాండ్ నోటీసులు అందుకున్న లబ్ధిదారులు వెంటనే డబ్బులు కట్టవలసినదిగా సూచించారు. డబ్బులు చెల్లించిన లబ్ధిదారులకు నివాస భవనాలను రిజిస్ట్రేషన్ చేస్తామని, తద్వారా పూర్తి హక్కులు పొందగలుగుతారని అన్నారు. అదేవిధంగా అర్హులైన ఏ ఒక్క లబ్ధిదారుడు నష్టపోరాదనే ఉద్దేశంతో ప్రభుత్వం జి.ఓ. 58, 59 క్రింద అభ్యంతరం లేని ఆక్రమిత ప్రభుత్వ, అసైన్డ్ భూములను ఆక్రమించుకొని ఇండ్లు నిర్మించుకున్న పేదలు తమ ఇంటి స్థలాలను క్రమబద్ధీకరించుకు నేందుకు దరఖాస్తు చేసుకొనుటకు ప్రభుత్వం ఈ నెల చివరి వరకు అవకాశం కల్పించిందని రమేష్ తెలిపారు. అయితే లబ్ధిదారులు 2020 జూన్ 2 నాటికి ఆ స్థలంలో నిర్మాణం గావించి వారి ఆధీనంలో ఉన్నట్లు డాక్యుమెంట్లు సమర్పించ వలసి ఉంటుందని అన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం నరసాపూర్ మండలం రెడ్డిపల్లి లో వెంకటేశ్వరా రైస్ మిల్లును సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల నుండి వస్తున్న ధాన్యాన్ని వెంటవెంటనే దించుకొని ట్రాక్ షీట్ ఇవ్వాలని, ఎలాంటి కోతలు పెట్టవద్దని హితవు చెప్పారు. ఈ సమావేశంలో ఆర్ డి ఓ సాయి రామ్, తహశీల్దార్ ఆంజనేయులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# పత్తి రైతులకు అధిక ఆదాయం అందించడమే వెల్‌స్పన్ ఫౌండేషన్ లక్ష్యం



హైదరాబాద్, మే9: పత్తి రైతులకు మెరుగైన ఆదాయం అందించడమే వెల్‌స్పన్ ఫౌండేషన్ లక్ష్యం. అందులో భాగంగా వెల్‌స్పన్ ఫౌండేషన్ (డబ్ల్యుఎఫ్) రంగారెడ్డి జిల్లాలోని రైతుల కోసం బెటర్ కాటన్ ఇనిషియేటివ్ (బీసీఐ) ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడంతో పాటుగా రంగారెడ్డి జిల్లాలో పత్తి రైతుల జీవనోపాధి మెరుగుపరచడం లక్ష్యంగా ప్రారంభించారు. అలాగే డబ్ల్యుఎఫ్‌కు చెందిన క్షేత్ర స్థాయి సిబ్బంది పొలాలకు, రైతులతో సహా వెళ్లడంతో పాటుగా మట్టి నమూనా సేకరిస్తారు. ఈ మట్టి పరీక్షలతో పాటుగా డబ్ల్యుఎఫ్ ఇప్పుడు రైతులతో సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలను సైతం నిర్వహిస్తుంది. ఈ సంవత్సర కార్యక్రమాలలో భాగంగా 77 మట్టి నమూనాలను 38 గ్రామాల నుంచి సేకరించారు. అత్యధికంగా నమూనాలను చేవెళ్ల తాలూకా నుంచి సేకరించారు. మొత్తం 24 గ్రామాల నుంచి 50 నమూనాలు వీటిలో ఉన్నాయి. ఈ భూసార పరీక్షల వల్ల రైతులు సరైన రీతిలో ఎరువులు వాడటంతో పాటుగా భూసారాన్నీ మెరుగుపరుచుకోగలిగారు.

ఈసందర్భంగా వెల్‌స్పన్ అధికార ప్రతినిధి మాట్లాడుతూ.. పర్యావరణ అనుకూల, సమ్మిళిత అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. స్థిరమైన వ్యవసాయ పద్ధతులను రైతులు స్వీకరించే నైపుణ్యం, విజ్ఞానాన్ని అందించే దిశగా ప్రారంభించిన కార్యక్రమం రంగారెడ్డి జిల్లాలోని తమ బెటర్ కాటన్ ఇనిషియేటివ్ ప్రాజెక్ట్ అన్నారు. ఈ ప్రాంతంలో పత్తిపంట రైతుల జీవనోపాధి అవకాశాలను మెరుగు పరచడంలో తోడ్పాటునందించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన రైతు మాట్లాడుతూ? ఈ ప్రాంతంలోని రైతులు ఈ కార్యక్రమాన్ని చక్కగా ఆదరించారన్నారు. తమ గ్రామంలో బీసీఐ ప్రాజెక్ట్‌ను డబ్ల్యుఎఫ్ పరిచయం చేయడం సంతోషంగా ఉందన్నారు. స్థిరమైన వ్యవసాయ పద్ధతుల పట్ల తామెంతగానో నేర్చుకున్నామన్నారు. తద్వారా తమ పంట నాణ్యత కూడా మెరుగుపడిందన్నారు.

# వెంకటేశ్వర్లని పరామర్శించిన పరికపల్లి



ఖమ్మం, మే9: (నేటినిజం ప్రతినిధి): కౌనిజర్ల మండలం పెద్దము నగాలగ్రామపంచాయితీకి చెందిన గంజి వెంకటేశ్వర్లు మోకాలి నొప్పితో బాధపడుతున్న విషయం తెలుసుకొని ఆయనను పరామర్శించిన పొంగులేటి శ్రీనన్న సైన్యం నాయకులు సర్పంచ్ పరికపల్లి శ్రీనివాస్ ఆయనకు అన్ని విధాలుగా అండగా ఉంటామని అధైర్యపడవద్దని భరోసా నిచ్చారు.అదే విధంగా మోకాలి ఆపరేషన్ గురించి ఖమ్మం వైద్యులతో మాట్లాడి తక్కువ ఖర్చుతో ఆపరేషన్ చేపిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు కంచు బీరయ్య,దేవాలయ చైర్మన్ దాసరి వీరబాబు,ఎస్ఎంసి కోప్షన్ సభ్యులు పరికపల్లి అంజయ్య,ఆత్మ డైరెక్టర్ సోల శ్రీనివాసరావు,రైతు సమన్వయ సమితి మెంబర్ గంజి రాము,తలారి చందు, గుడిపల్లి బిక్షం తదితరులు ఉన్నారు.

# ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగిరం చేయండి

మెదక్, మే9: (నేటినిజం ప్రతినిధి):ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగిరం చేయవలసినదిగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం నర్సాపూర్ మండలం పెద్ద చింతకుంట లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే రైతులు అకాల వర్షాలతో తల్లడిల్లుతున్నారని, ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని, తేమ శాతం కాస్త అటు ఇటు ఉన్న తూకం వేయాలని హితవు చెప్పారు. రైతులు కూడా ప్యాడి క్లినర్ ల ధాన్యం తూర్పారబట్టి తాల్లు లేకుండా నాణ్యమైన ధాన్యం కేంద్రాలకు తెచ్చిప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అవసరమైన గన్నీ సంచులు, టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగింగ్ చేసిన రైస్ మిల్లులకు వెంట వెంటనే తరలిస్తూ మిల్లర్లు కూడా 24 గంటలలోగా ధాన్యం దించుకునేలా పర్యవేక్షించాలని, టాబ్ ఎంట్రీ త్వరితగతిన చేయాలని అధికారులకు సూచించారు . జిల్లాలో ఇప్పటి వరకు 382 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 6,458 మంది రైతుల నుండి 56 కోట్ల 77 లక్షల విలువ గల 27,560 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 7 కోట్ల 18 లక్షలు వారి ఖాతాలో జమ చేశామని, త్వరలో మిగతా డబ్బులను రైతుల ఖాతాలో జమచేస్తామని అన్నారు .కలెక్టర్ వెంట తహశీల్దార్ ఆంజనేయులు, వ్యవసాయ అధికారులు, కేంద్రం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవానికి రూ.85,116 విలువ చేసే విగ్రహాల అందజేత

## – శీనన్న సైన్యం తరపున అందజేసిన బోడా శ్రావణ్ కుమార్



ఖమ్మం, మే9: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగరంలోని 8వ డివిజన్ వైయస్ఆర్ కాలనీలో ఈ నెల 14న ఆదివారం బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవం జరుగనుంది.

కాగా ఈ నేపథ్యంలో ప్రతిష్ఠకు అవసరమైన రూ. 85,116 ల విలువ చేసే అమ్మవార్ల విగ్రహాలను పొంగులేటి శీనన్న సైన్యం తరపున యూత్ నాయకులు బోడ శ్రావణ్ కుమార్ ఆలయ కమిటి నిర్వాహకులకు మంగళవారం అందజేశారు.

భవిష్యత్తులోనూ పొంగులేటి శీనన్న సైన్యం తరపున ఆలయ అభివృద్ధికి తమవంతు తోడ్పాటు అందిస్తామని శ్రావణ్ కుమార్ తెలిపారు.

# బీజేపీ గూటికి పద్మా దేవేందర్ రెడ్డి ?

హైదరాబాద్, మే9:సొంత జిల్లాలోనే సీఎం కేసీఆర్‌కు బిగ్ షాక్ తగలనుందా...? సీటు దక్కదన్న భయంతోనే సిట్టింగ్ ఎమ్మెల్యే ఒకరు బీజేపీ గూటికి చేరబోతున్నారా...? నియోజకవర్గంలో గొడవలకు కేసీఆర్ అండ్ కో కారణమన్న భావనతోనే పార్టీని వీడబోతున్నారా...? సదరు ఎమ్మెల్యే భర్త అమిత్ షాతో భేటీ అందుకేనా?.. ఈ ప్రశ్నలకు అవును అనే సమాధానం వస్తోంది. ఉమ్మడి మెదక్‌లో సీనియర్ నేతగా, ఎమ్మెల్యేగా, ఉద్యమం నుండి నడుస్తున్న సదరు మహిళా ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు అన్నది ఓపెన్ సీక్రెట్. జిల్లా మంత్రితో సత్సంబంధాలు కంటిన్యూ అవుతున్నా... అధిష్ఠానంతో వచ్చిన గ్యాప్‌తో తనకు టికెట్ దక్కదన్న నిర్ణయానికి సదరు ఎమ్మెల్యే వచ్చినట్లు తెలుస్తోంది.ప్రగతి భవన్ డైరెక్షన్‌లోనే కేసీఆర్ సామాజిక వర్గానికి చెందిన ఓ గ్రేటర్ ఎమ్మెల్యే కొడుకు తన నియోజకవర్గంలో పనిచేసుకుంటున్నా పార్టీ పట్టించుకోవటం లేదని, సీఎంతో సన్నిహితంగా ఉండే ఓ ఎమ్మెల్సీ కూడా తనకంటూ ఓ గ్రూపు ఏర్పాటు చేసుకొని పనిచేస్తున్నా అడగటం లేదని... తనకు వ్యతిరేకంగా తన నియోజకవర్గంలోనే రెండు గ్రూపులు ఏర్పాటయ్యేలా చేశారని సదరు ఎమ్మెల్యే, ఎమ్మెల్యే భర్త ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. తమ ఇబ్బందిని పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోయిందని సదరు నేతలు సన్నిహితుల వద్ద చాలా కాలంగా వాపోతున్నారన్న ప్రచారం ఉంది. ఇటీవల హుజురాబాద్ నియోజకవర్గ సమస్యను పరిష్కరించిన పార్టీ, అందరినీ కూర్చొబెట్టి మాట్లాడిందని... కొల్లాపూర్‌లో అయితే మాజీ మంత్రి అని కూడా చూడకుండా పార్టీ నుండి పంపించి సిట్టింగ్ ఎమ్మెల్యేకు అండగా ఉందని, ఇటు ఖమ్మంలోనూ అసమ్మతిని ప్రోత్సహించలేదని... కానీ తన నియోజకవర్గంలో మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరించటం అనేక అనుమానాలకు తావిస్తున్నట్లు సదరు లీడర్లు భావిస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో తమకు టికెట్ ఇచ్చే ఉద్దేశం లేకనే... ఇతర లీడర్లను ప్రోత్సహిస్తున్నారన్న అనుమానాలు కూడా సదరు లీడర్ వర్గంలో వినిపిస్తున్నాయి. అదే సమయంలో బీజేపీ నుండి ఆఫర్ కూడా రావటంతో ఎమ్మెల్యే భర్త కొన్ని రోజుల క్రితం ఢిల్లీలో హోంమంత్రి అమిత్ షా ను కలిశారని, పార్టీ అండగా ఉండటంతో పాటు టికెట్ సహా పలు ఆర్థికపరమైన అంశాలపై రాష్ట్ర నాయకత్వం ఇప్పటికే ఓ హామీ కూడా ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

# అభివృద్ధి పనులు సత్వర పూర్తికి మంత్రి కేటీఆర్ ఆదేశం-ఎమ్మెల్యే రమేష్ బాబు

రాజన్న సిరిసిల్ల, మే9:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ నియోజకవర్గ అభివృద్ధి పనులన్ని సత్వరంగా పూర్తి చేయటానికి సంబంధిత అధికారులకు మంత్రి కేటీఆర్ ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే రమేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా 70 కోట్లతో వివిధ మండల, పట్టణ, దేవాలయ కార్యక్రమాలకు జూన్ మొదటి వారంలో శంకుస్థాపన చేయనున్నట్టు పేర్కొన్నారు. 25 వేల మందితో ప్రజా ఆశీర్వాద సభకు సన్నాహాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 25వ తేది వరకు మంత్రి కేటీఆర్ విదేశి పర్యటనకు వెళుతున్న సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ బాబు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

# సాంకేతికతతో నడిచే పాలన 9 ఏళ్ల మోదీ ప్రభుత్వ పాలన విశిష్ట లక్షణం అని కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్



న్యూఢిల్లీ, మే 9:మోదీ ప్రభుత్వ 9 ఏళ్ల పాలనలో సాంకేతికతతో నడిచే పాలన ప్రధానమని కేంద్ర సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) సైన్స్ & టెక్నాలజీ; సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) ఎర్త్ సైన్సెస్; పీఎంవో, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణుశక్తి మరియు అంతరిక్ష శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈరోజు అన్నారు.

ముస్సోరీలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (ఎల్‌బిఎస్ఎన్ఎఎ)లో ఐఎఎస్ అధికారుల కోసం మిడ్-కెరీర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న వారిని ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'గరిష్ట పాలన, కనిష్ట ప్రభుత్వం' అనే మంత్రం తన పాలనా విధాన మన్న విషయాన్ని చెప్పారు. దానిని సుసాధ్యం చేయడానికి నిరంతరంగా పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆయన ఉపయోగించుకున్నారు.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వం స్వీయ-ధృవీకరణ లేదా ఇంటర్వ్యూల రద్దును ప్రవేశపెడుతూనే సులభ పాలన ద్వారా జీవన సౌలభ్యాన్ని అందించడానికి ప్రయత్నిస్తోందని, మరోవైపు ప్రభుత్వం కూడా పాలనా ఆవరణాన్ని పౌర సేవకుల కోసం పని వాతావరణాన్ని సులభతరం చేయడానికి ప్రయత్నిస్తోందని అన్నారు. ఉదాహరణకు, 30 ఏళ్ల తర్వాత 2018లో మోదీ ప్రభుత్వం సవరించిన అవినీతి నిరోధక చట్టం,1988 గురించి ఆయన ప్రస్తావించారు. దీనిలో అనేక కొత్త నిబంధనలను ప్రవేశపెట్టడంతోపాటు లంచం తీసుకోవడంతో పాటు లంచం ఇవ్వడాన్ని కూడా నేరంగా పరిగణించడంతోపాటు, అదే సమయంలో వ్యక్తులు మరియు కార్పొరేట్ సంస్థలచే అటువంటి చర్యలకు సమర్థవంతమైన నిరోధాన్ని ఉంచడం ద్వారా అధికారులపై అనవసర వేధింపులు నివారించవచ్చని తెలిపారు.

అదే విధంగా అధికారులకు తమ పాత్రపై మరింత నమ్మకం కలిగించేందుకు, మిషన్ కర్మయోగి మరియు ఐ గాట్ ప్లాట్‌ఫామ్‌లను ప్రవేశపెట్టామని, దీని ద్వారా కొత్త అసైన్‌మెంట్‌ను చేపట్టే ఏ అధికారి అయినా కొత్త అసైన్‌మెంట్ కోసం తమంత తాము స్వాభావిక సామర్థ్యాన్ని పెంపొందించుకోగలరని డాక్టర్ జితేంద్ర సింగ్ చెప్పారు. అదనంగా, మీరు సంబంధిత కేడర్‌కు వెళ్లే ముందు 3 నెలల అసిస్టెంట్ సెక్రటరీ స్టింట్ మొదటిసారిగా ప్రవేశపెట్టబడింది. తద్వారా కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యతలను తెలుసుకునేందుకు, మార్గదర్శకులను తీర్చిదిద్దేందుకు మీకు అవకాశం ఉందని మంత్రి చెప్పారు.

సాంకేతికతతో నడిచే పాలన యొక్క మరిన్ని కార్యక్రమాలను ప్రస్తావిస్తూ, డాక్టర్ జితేంద్ర సింగ్, ఆశావహ జిల్లా ఇదే తరహాలో మరొక ప్రయోగం, ఇక్కడ ప్రభుత్వం శాస్త్రీయ ప్రాతిపదికన సూచికలను నిర్ణయించింది. మన డ్యాష్‌బోర్డ్ నిజ సమయంలో నవీకరించబడుతుంది ఖచ్చితంగా అభివృద్ధి లక్ష్య సాధన కోసం నిరంతరం పోటీ జరుగుతోంది.

మరొక ముఖ్య లక్షణం ఫిర్యాదుల పరిష్కారం. పారదర్శకత మరియు జవాబుదారీతనం యొక్క ప్రమాణాలలో ఒకటి ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం అని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.

మేము సీ పీ గ్రామ్ ను ప్రవేశపెట్టినప్పుడు 2014లో దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం దాదాపు 2 లక్షల ఫిర్యాదులు దాఖలయ్యేవి, నేడు అవి దాదాపు 20 లక్షలకు చేరాయి, అంటే 10 రెట్లు ఎక్కువయ్యాయి. ఫిర్యాదుల పరిష్కారంపై ప్రజల్లో పెరిగిన విశ్వాసం యొక్క ఫలితం ఇది.

పౌరుల భాగస్వామ్యం ఇప్పటికే ప్రారంభమైందని, దానికి అత్యంత అద్భుతమైన ఉదాహరణ స్వామిత్వ పథకం అని మంత్రి అన్నారు. డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి భూములను మ్యాపింగ్ చేయడం ద్వారా మరియు చట్టపరమైన యాజమాన్య కార్డులు (ఆస్తి కార్డులు/టైటిల్) జారీ చేయడం ద్వారా 'రికార్డ్ ఆఫ్ రైట్స్' అందించడం ద్వారా గ్రామీణ నివాస (అబాది) ప్రాంతాలలోదస్తావేజులు గ్రామ గృహ యజమానులకు ఆస్తి యజమానులకు ఆస్తిపై స్పష్టమైన యాజమాన్యాన్ని స్థాపించే దిశగా ఇది ఒక సంస్కరణాత్మక అడుగు.

డిజిటల్ పరివర్తన గురించి మంత్రి మాట్లాడుతూ, ఫిబ్రవరి 2023 నాటికి సెంట్రల్ సెక్రటేరియట్‌లోని అన్ని 75 మంత్రిత్వ శాఖలు/ డిపార్ట్‌మెంట్లలో ఇ-ఆఫీస్ వెర్షన్ 7.0 అవలంబించబడింది. మొత్తం సెంట్రల్ సెక్రటేరియట్ ఫైళ్లలో 89.6 శాతం ఈ-ఫైళ్లుగా ప్రాసెస్ చేయబడటం అభినందనీయమైన విజయం.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, రాబోయే 25 సంవత్సరాలలో, సాంకేతికత మరియు మానవ అనుసంధాల మధ్య వాంఛనీయ సమతుల్యతను ఎలా సాధించాలి మరియు ఉత్తమ ఫలితాలను పొందడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు మానవ మేధలు రెండింటినీ కలపడం ద్వారా వాటి మధ్య సమతుల్యతను సాధించడం అనేది ఇప్పుడు సవాలుగా ఉంటుందని డాక్టర్ జితేంద్ర సింగ్ చెప్పారు.

మంత్రి మాట్లాడుతూ, రాబోయే 25 సంవత్సరాల పాటు చురుకైన సేవలో పాల్గొనే మరియు 100 సంవత్సరాల స్వాతంత్ర్య వేడుకలను జరుపుకునే ప్రత్యేకతను కలిగి ఉన్న యువ సివిల్ సర్వెంట్లకు శిక్షణ ఇవ్వడానికి వారు భారత ప్రభుత్వంలో 2047 నాటికి ఉన్నత పదవులకు అధిరోహించేందుకు అకాడమీ ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది అన్నారు.

లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (ఒబాఔం) డైరెక్టర్ శ్రీ కె శ్రీనివాస్ తన ప్రసంగంలో, అకాడమీ మిషన్ కర్మయోగి కార్యక్రమానికి అనుగుణంగా మారిందని అన్నారు.

# కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ ఇందుకేనా? : బీజేపీ నేత దినేష్ కులాచారి

నిజామాబాద్, మే9: ఎన్నో ఏళు పోరాడి, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ ఒక కుటుంబం కోసం కాదు.. యావత్ తెలంగాణ ప్రజల కోసమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దినేష్ కులాచారి అన్నారు. అదే విధంగా ప్రభుత్వంపై పంచాయతీ కార్యదర్శులు మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు ఇవ్వడం పై జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము పల్లె ప్రగతి కార్యక్రమాలు చేసినందుకా.. హరితహారం కార్యక్రమంలో పాల్గొని హరిత తెలంగాణగా తీర్చిదిద్ది నందుకా.. స్వచ్ఛ గ్రామాలు చేసినందుకా? చివరికి న్యాయంగా మాకు రావాల్సిన హక్కులను అడిగినందుకా అని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యుల రైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె మంగళవారం నాటికి 12వ రోజుకు చేరుకుంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 9,350 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం సాయంత్రం ఐదు గంటలలోపు విధుల్లో చేరాలని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నోటీసులు జారీ చేసిన విషయం విధితమే. మంగళవారం నిజామాబాద్ నగరంలోని ధర్నా చౌక్ లో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు బిజెపి జిల్లా అధ్యక్షుడు బస్వ లక్ష్మీ నరసయ్య, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దినేష్ కులాచారి మద్దతు పలికారు. ఈ సంధ్భంగా బిజెపిరాష్ట్ర కార్యవర్గ సభ్యులు దినేష్ కులాచారి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల హక్కులను కాలరాస్తూ నిరంకుశ పాలన కొనసాగిస్తుందని ధ్వజమెత్తారు. తాటాకుల చప్పులకు భయపడేది లేదని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల డిమాండ్లు న్యాయమైనవని అన్నారు. బిజెపి పార్టీ వారికి పూర్తిగా అండగా ఉంటుందని వారి సమస్యల సాధనకు ముందుండి పోరాడుతామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేస్తూ జీవో ప్రకటించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# ఎన్నికల వ్యయ నియంత్రణపై ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి కర్ణాటక ఎన్నికల్లో భారీగా నగదు స్వాధీనం



న్యూఢిల్లీ, మే 9:ప్రలోభాలకు తావు లేకుండా కర్ణాటక శాసనసభ ఎన్నికలు జరిగేలా చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. గత కొన్ని శాసనసభ ఎన్నికల్లో ప్రారంభించిన చర్యలను ఎన్నికల సంఘం కర్ణాటక ఎన్నికల్లో కొనసాగిస్తోంది. ఎన్నికల సంఘం పర్యవేక్షణ పెరగడంతో 2018 ఎన్నికలతో పోల్చి చూస్తే ప్రస్తుత ఎన్నికల్లో నాలుగు రెట్లు అధికంగా నగదు, మద్యం, ఆభరణాలు, మాదకద్రవ్యాల లాంటి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పొరుగు రాష్ట్రాల సహకారం, వివిధ ప్రభుత్వ సంస్థలు సమన్వయం తో పని చేయడంతో కఠిన పర్యవేక్షణ సాగుతోంది.

కర్ణాటక ఎన్నికల సందర్భంగా స్వాధీనం చేసుకున్న వస్తువుల వివరాలు ( 08.05.2023 నాటికి) కింది విధంగా ఉన్నాయి.

సాక్షించిన ఎన్నికల సంఘం అధికారులు వివిధ కేంద్ర, రాష్ట్ర సంస్థల మధ్య సమన్వయం సాధించడం సాధించడానికి అమలు చేయాల్సిన చర్యలను చర్చించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో కూడా చర్చలు జరిపారు. కర్ణాటక ఎన్నికల వివరాలు ప్రకటించిన సమయంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ శ్రీ రాజీవ్ కుమార్ ప్రలోభాలకు తావు లేకుండా ఎన్నికలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఓటర్లను ప్రలోభపరచడానికి చర్యలు అమలు జరగకుండా చూస్తామన్నారు. ప్రలోభాలు లేకుండా స్వేచ్ఛగా ఎన్నికలు జరిగేలా చూసేందుకు నిఘా, పర్యవేక్షణ పెంచుతామని శ్రీ రాజీవ్ కుమార్ ప్రకటించారు. గతంలో ఎన్నికలు జరిగిన 5 రాష్ట్రాల్లో అమలు చేసిన చర్యలను కర్ణాటకలో కూడా కొనసాగించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది.

దీనికి అనుగుణంగా ఎన్నికల సంఘం కర్ణాటకలో అమలు చేస్తున్న ప్రణాళిక ఆశించిన ఫలితాలను ఇస్తోంది. నిఘా, పర్యవేక్షణ పెంచడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు లోకి వచ్చిన అనంతరం కర్ణాటకలో ఓటర్లను లోబరుచుకోవడానికి సిద్ధం చేసిన 375. 61 కోట్ల రూపాయల విలువ చేసే వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 2018 ఎన్నికలతో పోల్చి చూస్తే స్వాధీనం చేసుకున్న వస్తువుల విలువ నాలుగు రెట్లు ఎక్కువగా ఉంది. మార్చి 2వ వారంలో జరిగిన కమిషన్ పర్యటన నుంచి ఇంతవరకు నిఘా సంస్థలు 83.78 కోట్ల రూపాయలను స్వాధీనం చేసుకోవడంతో పాటు 288 కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తులను జప్తు చేశాయి. కోలార్ జిల్లాలోని బంగారుపేట ఏసీలో రూ. 4.04 కోట్ల నగదు స్వాధీనం చేసుకోవడం, హైదరాబాద్‌లోని ఆల్ప్రాజోలమ్‌ను అక్రమంగా తయారు చేస్తున్న ల్యాబ్‌పై ఇంటెలిజెన్స్ సేకరించిన దాడి మరియు ఎన్‌సీబీ ద్వారా ట్రయల్ మ్యాపింగ్ చేయడం వంటి ముఖ్యమైన మోసాలు ఉన్నాయి; బీదర్ జిల్లాలో 100 కిలోల గంజాయి స్వాధీనం; అన్ని జిల్లాల్లో పెద్దఎత్తున మద్యం సీజ్‌లు జరిగాయి. ఖర్చుల పర్యవేక్షణ యొక్క మరొక అద్భుతమైన లక్షణం ఉచితాలను భారీగా స్వాధీనం చేసుకోవడం. కల్బుర్గి, చిమంగ్లూర్ తదితర జిల్లాల్లో చీరలు, ఆహారపదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. బైల్‌హ్పొంగల్ మరియు కుణిగల్ మరియు ఇతర ఏసీల నుండి భారీ సంఖ్యలో ప్రెషర్ కుక్కర్లు మరియు వంటగది ఉపకరణాలు కూడా స్వాధీనం చేసుకున్నారు.

ఎన్నికల ప్రకటన వెలువడక ముందు నుంచే విస్తృతమైన పర్యవేక్షణ ప్రక్రియ ప్రారంభమైంది. దీనిలో భాగంగా ఎన్నికల ఏర్పాట్లు సమీక్షించిన ఎన్నికల సంఘం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, డీఈఓలు/ ఎస్పీలు, అనుభవజ్ఞులైన అధికారులను వ్యయ పరిశీలకులు గా నియమించిన, సున్నిత నియోజకవర్గాలను గుర్తించి వివిధ ప్రభుత్వ సంస్థల మధ్య సమన్వయం సాధించడానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. క్షేత్ర స్థాయిలో పని చేయడానికి అవసరమైన బృందాలను సిద్ధం చేసిన కమిషన్ 146 వ్యయ పరిశీలకులను నియమించింది. 81 అసెంబ్లీ నియోజకవర్గాలను కట్టుదిట్టమైన నిఘా కోసం వ్యయ సున్నిత నియోజకవర్గాలుగా గుర్తించింది.

ఎన్నికలు జరుగుతున్న కర్ణాటక రాష్ట్రానికి పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, గోవా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు సరిహద్దు చెక్‌పోస్టుల ద్వారా శాంతిభద్రతల పరిస్థితి, అంతర్ రాష్ట్ర నిఘాను కూడా కమిషన్ మే 1, 2023న సమీక్షించింది. సమీక్షకు అన్ని సరిహద్దు రాష్ట్రాలకు చెందిన ముఖ్యమైన ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల కార్యదర్శులు, డీజీపీ లు, ఎక్సైజ్ కమిషనర్లు, ప్రాంతీయ అధిపతులు సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఈసీ శ్రీ రాజీవ్ కుమార్ సరిహద్దు జిల్లాల్లోని 185 చెక్‌పోస్టులలో సరైన నిర్వహణ, పర్యవేక్షణ ప్రాధాన్యత వివరించి అన్ని రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎన్నికల కమిషనర్ శ్రీ అనూప్ చంద్ర పాండే అక్రమ మద్యం స్వాధీనం చేసుకునే అంశానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అక్రమ వ్యాపారులపై చర్యలు తీసుకుని , అక్రమ మద్యం నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా నిఘా ఉండాలని, జప్తు ఆపరేషన్ల తర్వాత నిబంధనలు పాటించాలని ఎన్నికల కమిషనర్ శ్రీ అరుణ్ గోయెల్ అధికారులను కోరారు. సరిహద్దు చెక్‌పోస్టుల నుండి దాదాపు 70 కోట్ల రూపాయల విలువ చేసే నగదు, మద్యం, డ్రగ్స్, ఆభరణాలు, ఉచితంగా పంచి పెట్టడానికి తరలిస్తున్న వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు నిరోధక కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటున్నాయి. రాష్ట్ర పోలీస్, ఆదాయపు పన్ను, వాణిజ్య పన్ను, ఈడీ, ఆర్పీఎఫ్, జీఆర్పీ, సిఐఎస్ఎఫ్, ఎన్సీబి, సిఐఎఫ్ఎఫ్,డిఆర్ఐ సహా వివిధ సంస్థలు నిఘా, జప్తు కార్యక్రమాల్లో పాల్గొన్నాయి. ఉచితాలు, ప్రలోభాలకు దూరంగా ఉండాలని ప్రజలను చైతన్యవంతులను చేయడానికి వివిధ సంస్థలు కృషి చేస్తున్నాయి.

# ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై జిల్లా స్థాయి సమావేశం

మెదక్, మే9: (నేటినిజం ప్రతినిధి):ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వచ్చే వానకాలం సీజన్లో ఒకవేళ సరైన సమయంలో వర్షాలు కురవడం ఆలస్యమైతే ప్రత్యామ్నాయంగా వరికి బదులుగా వేసుకోదగిన పంటలు, రకాలు గూర్చి , ఒకవేళ జూలై 15 వ తారీకు లోపు వర్షాలు పడకపోతే వేయవలసిన పంటలు , జూలై 30 వ తారీకు లోపు వర్షాలు పడకపోతే వేయవలసిన పంటలు ,ఆగస్టు 15 వ తారీకు లోపు వర్షాలు పడకపోతే వేయవలసిన పంటలు ,మెదక్ జిల్లా స్థానిక పరిస్థితులకు అనుకూలమైన రకాలు కావలసిన విత్తన మోతాదు అందుబాటులో ఉండే ప్రదేశాలు గూర్చి ఏరు వాకా కేంద్రం సంగారెడ్డి ,ఏరువాక కేంద్రం సిద్దిపేట, వ్యవసాయ పరిశోధన స్థానం నత్తనాయిపల్లి ,కృషి విజ్ఞాన కేంద్రం తునికి సంబంధించిన ప్రధాన శాస్త్రవేత్తలు సమన్వయకర్తలు వ్యవసాయ సహాయ సంచాలకులు రైతులతో జిల్లా వ్యవసాయ అధికారి ఆశా కుమారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ వచ్చే వాన కాలంలో వర్షాలు సరైన సమయంలో కురవ నట్లయితే వేసుకో తగినటువంటి ప్రత్యామ్నాయ పంటల గురించి పైన పేర్కొన్న టువంటి శాస్త్రవేత్తలతో వివరంగా చర్చించి రైతులకు ప్రత్యామ్నాయ పంటలకు సంబంధించిన విత్తనాలను అందుబాటులో ఉండే విధంగా నివేదికను తయారుచేసి ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆశా కుమారి తో పాటుగా ఏరువాక కేంద్రం సంగారెడ్డి సమన్వయకర్త డాక్టర్ సరిత, ఏరువాక కేంద్రం సిద్దిపేట సమన్వయకర్త విజయ్ కుమార్, వ్యవసాయ పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త శ్రీమతి శోభా రాణి, కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రవికుమార్ , ప్రతాప్ రెడ్డి, జిల్లాలోని వివిధ డివిజన్లకు సంబంధించిన సహాయ వ్యవసాయ సంచాలకులు రైతులు పాల్గొన్నారు

# సంగారెడ్డి జిల్లాలో ఎమ్మెల్యే టిక్కెట్లు వరించే నాయకులెవరో ..!

సంగారెడ్డి మే 9 (నేటి నిజం ప్రతినిధి) సంగారెడ్డి జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజక వర్గాలు సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్, పటాన్చెరు ఉండగా, సంగారెడ్డి నియోజకవర్గం మాత్రం కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కొనసాగుతుండగా , జహీరాబాద్ కు మాణిక్యరావు, నారాయణఖేడ్ కు భూపాల్ రెడ్డి ,ఆందోల్ లో క్రాంతి కిరణ్, పటాన్చెరుకు మహిపాల్ రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారు. వచ్చే ఏడాదిలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఐదు నియోజకవర్గాల్లో కూడా పోటీ చేసేందుకు అనేకమంది ఆశావాహులు ముందుకు వస్తున్నారు. సామాజికవైన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అనేక రకాలుగా సహాయ సహకారాలు అందిస్తూ ప్రజలను ఆకట్టుకుంటున్నారు. పటాన్చెరు నియోజకవర్గంలో పోటీ చేసేందుకు నీలం మధు ముదిరాజ్ టికెట్ కోసం ప్రజల్లో పలు సాంఘిక కార్యక్రమాలు చేస్తూ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. జహీరాబాద్ నియోజకవర్గం నుండి ఏర్రొల్ల శ్రీనివాస్ , అందోల్ నియోజకవర్గం నుండి మాజీ ఎమ్మెల్యే బాబు మోహన్, సంగారెడ్డి నియోజకవర్గం నుండి పులిమామిడి రాజు , పట్నం మాణిక్యం , కొండాపూర్ మండల పరిషత్ అధ్యక్షులు మనోజ్ రెడ్డి ,చింతా ప్రభాకర్లు టికెట్ల కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు . నారాయణఖేడ్ నుండి స్థానిక ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి, మళ్లీ తనకే టికెట్ వస్తుందని ధీమాతో ఉన్నారు. జహీరాబాద్, ఆందోల్, సంగారెడ్డి , పటాన్చెరు ,నారాయణఖేడ్ నియోజకవర్గాల్లో టికెట్లు ఎవరిని వరిస్తాయో వేచి చూడవలసిందే. సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఆందోల్ మాజీ ఎమ్మెల్యే బాబు మోహన్లు బీఆర్ఎస్ పార్టీలోకి వస్తారని పుకార్లు వినిపిస్తుండగ నిజనిజాలు కోసం వేచి చూడాల్సిందే.

# కర్ణాటకలోనూ పసుపు బోర్డు హామీ.. హవ్వా సిగ్గు సిగ్గు : మంత్రి వేముల



హైదరాబాద్, మే9:నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో బాండ్ రాసిచ్చిన బీజేపీ నేడు అదే హామీతో కర్నాటక ఎన్నికల్లో రైతులను మోసం చేస్తుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం కుకునూర్ గ్రామానికి చెందిన బీజేపీ,బీఎస్పీ పార్టీకి చెందిన పలువురు యువకులు హైదరాబాద్‌లో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆయన మాట్లాడుతూ పసుపు బోర్డు తెలంగాణ రాష్ట్రంలో సాధ్యం కానిది,కర్ణాటకలో ఎలా సాధ్యం అవుతుందని ప్రశ్నించారు. బీజేపీ వల్ల దేశంలో వైషమ్యాలు తప్పా అభివృద్ధి లేదని అన్నారు. సీఎం కేసీఆర్అభివృద్ధి కోసం పని చేస్తుంటే బీజేపీ విద్వేష, కక్ష పూరిత రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. కేసీఆర్ దార్శనికత వల్ల రాష్ట్రం అన్ని రంగాల్లో నెంబర్ వన్ గా ఎదిగిందని గుర్తు చేశారు.

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి కేటీఆర్ వల్ల రాష్ట్రానికి వేలాది పరిశ్రమలు వచ్చాయని, సుమారు 16 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. కేటీఆర్ చొరవ వల్ల ఐ.టీ ఎగుమతులు పెరిగాయని, నూతన ఆవిష్కరణలకు తెలంగాణ వేదికైందని తెలిపారు. బీజేపీలో విలువలు దిగజారిపోయాయని విమర్శించారు.

ప్రభుత్వరంగ సంస్థలు అమ్ముతూ,అన్ని రకాల ధరలు పెంచుతూ సామాన్యులను అరిగోస పెడుతున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీ అసమర్థ ప్రధాని అని దుయ్యబట్టారు.రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాలు, ముఖ్యమంత్రి కేసీఆర్ పనితీరు, బీజేపీ అలంభిస్తున్న విధానాలపై గ్రామాల్లో ముఖ్యంగా యువతలో చర్చ జరగాలన్నారు. బీజేపీ తీరుకు నిరసనగా ఆ పార్టీకి చెందిన యువకులు రాజీనామాలు చేసి బీఆర్ఎస్‌లో చేరడం యువతలో వచ్చిన మార్పునకు నాంది అని అన్నారు.

బీజేపీ,బీఎస్పీ పార్టీల నుంచి భారత రాష్ట్ర సమితిలో చేరిన వారిలో?ఎద్దండి రంజిత్, ర్యాడ ప్రణయ్, బక్కయ్యగారి వినేశ్, బాసర భరత్, ఒరగంటి వినయ్, మోర్తాడ్ గణేష్ ,మర్రి వినోద్, పుప్పాల సత్యనారాయణ,గోల్కొండ శరత్, దాసరి నితిష్, బి.శ్రీనివాస్ గౌడ్, పందేన శంకర్, మర్రి చిన్నారెడ్డి, సిరుప అజయ్, దాసరి సాయికిరణ్, బోజపల్లి శ్రీకర్, బండి ఉదయ్, బాలిశెట్టి సాగర్, బక్కయ్యగారి నితిన్, గోల్కొండ మల్లేష్, జి. అక్షయ్, ర్యాడా రాకేష్, కె.విజ్ఞేష్,వి.సుశాంత్ తదితరులున్నారు.

ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, డాక్టర్ మధుశేఖర్, వైస్ ఎంపీపీ సురేష్ ,సర్పంచ్ లింబాద్రి,రాజశేఖర్ గౌడ్, మాజీ సర్పంచ్ అశోక్, ఎస్సీ మండల ప్రెసిడెంట్ తలారి ప్రభాకర్, మోర్తాడ్ నర్సయ్య, యువ నాయకులు నిమిష్ తదితరులు పాల్గొన్నారు.

# అమర వీరుల కుటుంబాలపై మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదు : మంత్రి ఎర్రబెల్లి




మహబూబాబాద్, మే9:(నేటి నిజం ప్రతినిధి): తెలంగాణ ఉద్యమంలో ఆత్మబలిదానాలకు కారణమైన కాంగ్రెస్ నేడు మొసలి కన్నీరు కారుస్తున్నదని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆరోపించారు. అమరవీరుల కుటుంబాలపై ఒలకబోస్తున్న ప్రియాంక గాంధీ తీరు నవ్వు తెప్పిస్తుందని ఆయన అన్నారు. బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా మంగళవారం తొర్రూరు మున్సిపల్ కేంద్రంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మంత్రి మాట్లాడారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీల వైఖరిపై మండిపడ్డారు. తెలంగాణ అమర వీరుల కుటుంబాల గురించి కాంగ్రెస్ మాట్లాడటం అంటే హత్య చేసి, శవంపై దండలు వేసి కన్నీరు కారుస్తున్న చందంగా ఉందని విమర్శించారు. 25 ఏండ్ల కిందనే కాంగ్రెస్ తెలంగాణ ఇస్తే, ఆత్మ బలిదానాలు జరిగేవా? అమర వీరుల కుటుంబాలు ఉండేవా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ చేసిన మోసంతోనే అనేక మంది బలిదానాలు చేసుకున్నారని ఆరోపించారు.

దేశం కోసం మహాత్మా గాంధీ ఏ తరహాలో పోరాటం చేశారో, అదే తరహాలో తెలంగాణ కోసం కేసీఆర్ ప్రాణాలకు తెగించి రాష్ట్రాన్ని సాధించారని అన్నారు. ఉద్యోగాల విషయంలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, ఇప్పటి వరకు లక్షా 33వేల పై చిలుకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, ఇంకా 80 వేలకు పై బడి ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు వేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో నిరుద్యోగ భృతి ఇచ్చిన దాఖలాలు ఉన్నాయా? అని నిలదీశారు.

ఎన్నికల్లో ఓట్ల కోసం గారడి మాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. బీజేపీ అధికారంలోకి రాగానే రూ.200 లకు గ్యాస్ సిలిండర్ ఇస్తామని చెప్పి, రూ.1200 చేశారని మండిపడ్డారు. దేశంలో ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి వివరాలను ప్రజలకు బీఆర్ ఎస్ శ్రేణులు వివరించాలని ఆయన సూచించారు.

# పోలీస్ అధికారులకు డీజీపీ సన్మానం

హైదరాబాద్, మే9: మణిపూర్ రాష్ట్రంలో తలెత్తిన శాంతి భద్రతల పరిస్థితుల నేపథ్యంలో ఆ రాష్ట్రంలోని తెలంగాణ వాసులను సురక్షితంగా హైదరాబాద్ కు తరలించడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను డీజీపీ అంజనీ కుమార్ మంగళవారం అభినందించారు. డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పోలీస్ అధికారులు అడిషనల్ డీజీలు మహేష్ భగవత్, అభిలాష బిస్త్, డీఐజీ బి. సుమతి తోపాటు, కంట్రోల్ రూంలో విధులునిర్వహించిన జయరాం, నగేష్ బాబు, తిరుపతి, సుదర్శన్ తదితర పోలీస్ అధికారులను సన్మానించారు.

ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ మణిపూర్ నుంచి తెలంగాణ వాసులను తరలించడం లాంటి అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ అధికారులు అత్యుత్తమ సేవలందించారని ప్రశంసించారు. పర్వత ప్రాంతమైన మణిపూర్ లో సరైన కమ్యూనికేషన్ సౌకర్యాలు లేనప్పటికీ అక్కడి పోలీస్, మిలటరీ అధికారులతో ఎప్పటికప్పుడూ సంప్రదించడం, వివిధ ప్రభుత్వ శాఖలతో సమన్వయంతో పనిచేయడం అభినందనీయమని అన్నారు.

పోలీసులకు ఇటువంటి ఘటనలు సరికొత్త పాఠాలుగా ఉంటాయని పేర్కొన్నారు. అడిషనల్ డీజీ మహేష్ భగవత్ మాట్లాడుతూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఇతర శాఖల అధికారులతో ఎప్పటికప్పుడూ మాట్లాడి 112 మందిని సురక్షితంగా తెలంగాణకు చేర్చగలిగామని పేర్కొన్నారు.

# మన ఊరు - మనబడి పనులను మే చివరి వరకు పూర్తి చేయాలి-ఎంపిపి ఈదురు రాజేశ్వరి



మహబూబాబాద్, మే9:(నేటి నిజం ప్రతినిధి): పెద్దవంగర మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, విద్యా కమిటీ చైర్మన్ లు మరియు స్కూలు హెడ్మాస్టర్ లతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ఎంపిపి ఈదురు రాజేశ్వరి హాజరై వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మన ఊరు,మనబడి కార్యక్రమంలో పూర్తి గాని మిగులు పనులను త్వరగా ఈనెల మే చివరి వరకు పూర్తిచేసి ఈ విద్యా సంవత్సరం జూన్ వరకు సర్వం సిద్ధం చేసి పంచాయతీరాజ్ మరియు ఆర్డబ్ల్యూఎస్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చేతుల మీదుగా ప్రారంభించుకొని విద్యార్థులకు అందుబాటులోకి తీసుకరావడం జరుగుతుందని తెలిపారు. పూర్తి చేసిన పనులను ఎప్పటికప్పుడు రికార్డు చేసి బిల్లులను ఆన్లైన్లో నమోదు చేయించాలని సంబంధిత ఏఈ కి సూచించారు.

ఈనెలలో 15,16,17తేదీలలో జరిగే సీఎం కప్ ఆటలపోటీలను గ్రామాలలోని విద్యార్థిని, విద్యార్థులు, యువకులు, మహిళలు, ప్రజలు పాల్గొని విజయవంతం చెయ్యాలని ఎంపిపి అన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలలో ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రీడ నిర్వాహన కోసం రాష్ట్ర ప్రభుత్వం 15వేల రూపాయలు ఖర్చు చేయడం జరుగుతుందని అన్నారు.

ఈ క్రీడల కప్ నిర్వాహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కమిటీ చైర్మన్ గా ఎంపీపీ ,సభ్యులుగా జడ్పీటీసీ, కన్వీనర్ గా ఎంపీడీవో మరియు సభ్యులుగా తాసిల్దార్, ఎస్సై వ్యవహరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి శ్రీరాం జ్యోతిర్మయి, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, ఎమ్మార్వో రమేష్ బాబు,ఏఈ అశోక్, ఎంపీ ఓ సత్యనారాయణ,సర్పంచ్లు వెనుకదాసుల లక్ష్మి ,రావుల శ్రీనివాస్ రెడ్డి,చింతల భాస్కర్, ఎంపీటీసీ సభ్యులు బానోత్ రవీందర్, ఏఎస్ఐ కుమారస్వామి, నోడల్ హెచ్ఎంలు బిక్షపతి, మడిపెద్ది వెంకన్న,విజయ్ కుమార్,విద్యా కమిటీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యానికీ అదే ధర ఇస్తున్నాం..

## కీసరలో రూ.1.50 కోట్లతో నిర్మించిన గిడ్డంగిని ప్రారంభించిన మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్, మే9: వర్షాలకు దెబ్బతిన్న పంటలను ప్రభుత్వం మంచి ధరకు కొనుగోలు చేస్తుందని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. కీసర మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కొత్తగా నాబార్డు నుంచి రూ.1.50 కోట్లతో నిర్మించిన గిడ్డంగిని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. రైతులు ఇబ్బందులు పడకుండా అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు కూడా సరైన ధర ఇస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రైతులకు రూ.10వేల పంట నష్టం కింద ఇస్తున్నాడన్నారు. కేంద్రంలో బీజేపీ రైతులను మోసం చేస్తుందని, దమ్ముంటే కేంద్రం రైతులకు రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగినంత అభివృద్ధి మరెక్కడా జరుగలేదన్నారు. సీఎం కేసీఆర్ వచ్చే ఎన్నికల్లో గెలిచి దేశ ప్రధాని కావడం ఖాయమన్నారు. మహారాష్ట్రలో మన బీఆర్ఎస్‌కు చక్కటి ఆదరణ లభిస్తుందన్నారు. అదేవిధంగా మేడ్చల్ మండలంలోని పూడూర్ గ్రామంలో సోమవారం మంత్రి మల్లారెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, కీసర తహసీల్దార్ గౌరీవత్సల, వైస్ చైర్మన్ బెస్త వెంకటేశ్, రైతు బంధు జిల్లా అధ్యక్షుడు నారెడ్డి నందారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ భాస్కర్‌యాదవ్, వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారు మల్లేశ్‌యాదవ్, మండల వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డి, కీసర సర్పంచ్ నాయకపు మాధురివెంకటేశ్, మండల పార్టీ అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల నాయకులు, పలువురు పాల్గొన్నారు.

# భారత్‌లో బెస్ట్ సెల్లింగ్ కారు మారుతి వ్యాగన్-ఆర్..!




న్యూఢిల్లీ, మే 9:కరోనాకు ముందుతో పోలిస్తే.. తర్వాతి కాలంలో ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ పర్సనల్ మొబిలిటీకి ప్రాధాన్యం ఇస్తున్నారు. సాధ్యమైనంత మేరకు స్పేసియస్‌గా, ఎక్కువ మంది ప్రయాణించడానికి వీలుగా ఉండే ఎస్‌యూవీ కార్ల కొనుగోళ్లకు మొగ్గుతున్నారు. గతేడాది 2022లో అమెరికన్లు ఫోర్డ్ ఎఫ్ సిరీస్ ఎస్ యూవీ కార్లపై మోజు పెంచుకున్నా.. తర్వాత ఇండియాలో బెస్ట్ సెల్లింగ్ కారుగా మన మారుతి వ్యాగన్-ఆర్ నిలిచింది. భారత్ మొదలు అగ్రరాజ్యం అమెరికా, బ్రిటన్, చైనా, జర్మనీ దేశాల్లో అత్యధికంగా అమ్ముడైన కార్ల వివరాలు తెలుసుకుందామా..!

అగ్రరాజ్యం అమెరికాలో ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కార్ల తయారీ సంస్థ ఫోర్డ్.. ఎఫ్ సిరీస్ కార్లపై అమెరికన్లు మనస్సు పారేసుకున్నారు. 2022లో అత్యధికంగా ఫోర్డ్ 'ఎఫ్' సిరీస్ కార్లు సొంతం చేసుకున్నారు. 2021తో పోలిస్తే గతేడాది (2022)లో 9,08,921 కార్లు అమ్ముడయ్యాయి. 2021లో 8,94,757 కార్లు సేల్ అయ్యాయి. 2022లో ఎస్‌యూవీ కార్లు 8,61,256 అమ్ముడు పోయాయి. జర్మనీలో గతేడాది సేల్ అయిన కార్లలో ఫోక్స్ వ్యాగన్ గోల్ఫ్ నిలిచింది. 2022లో జర్మనీలో గరిష్టంగా 84,282 కార్లు విక్రయించింది ఫోక్స్ వ్యాగన్. బ్రిటన్‌లో నిసాన్ కంపెనీకి చెందిన ఖ్వాష్ ఖాయి మోడల్ కారు 2022లో అత్యధికంగా 42,704 కార్లు విక్రయించింది.

# ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్న.. పవన్ కల్యాణ్

హైదరాబాద్, మే9:రేపు అంటే మే 10న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పర్యటించనున్నారు పవర్ స్టార్..జనసేన అధినేత పవన్ కల్యాణ్. అకాల వర్షాలతో పంటలు కోల్పోయి నష్టాల పాలైన రైతులను పవన్ కల్యాణ్ పరామర్శించనున్నారు. పవన్ బుధవారం ఉదయం రాజమండ్రి చేరుకుంటారు. ఉమ్మడి గోదావరి జిల్లా పరిధిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించి, రైతులను కలుసుకోనున్నారు. వారితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకోనున్నారు. పవన్ పర్యటన పలు నియోజకవర్గాల మీదుగా సాగనుంది. ఈ పర్యటనలో పవన్ తో పాటు జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, ఆ పార్టీ రాష్ట్ర, జిల్లా నేతలు పాల్గొంటారు.

# విశాఖ జూలో వైట్ టైగర్ కుమారి కన్నుమూత..

అమరావతి, మే 9: విశాఖ జూలో గత 20 సంవత్సరాలుగా ప్రత్యేక ఆకర్షణగా ఉన్న వైట్ టైగర్ కుమారి సోమవారం కన్నుమూసింది. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వైట్ టైగర్ కు వెటర్నరీ వైద్యులు గత కొన్ని రోజులుగా చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలోనే మల్టీపుల్ ఆర్గాన్స్ ఫెయిల్ కావడంతో సోమవారం జూ లోనే కన్నుమూసింది. 2004 సంవత్సరంలో హైదరాబాద్ జూ లో ఈ వైట్ టైగర్ కుమారి జన్మించింది. ఆ తర్వాత అక్కడి నుంచి దానిని విశాఖపట్నం జూ కు తరలించారు. అరుదైన తెల్ల పులి ఎందరో పర్యాటకులను ఆకర్షించింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతమున్న ఏకైక తెల్ల పులి కుమారి కావడం విశేషం.

# త్వరలో నగరానికి సైన్స్ మ్యూజియం

హైదరాబాద్, మే9:హైదరాబాద్ నగరానికి సైన్స్ మ్యూజియం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉందని, త్వరలో ఆ కల నెరవేరుతుందని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ కళైసెల్వి అన్నారు. జీనీ హెల్త్ కనెక్ట్-మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్ ఎంతగానో సహకరిస్తుందని సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ కళైసెల్వి అన్నారు. సీసీఎంబీ, బెంగళూరులోని విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్, టెక్నాలజికల్ మ్యూజియం ఆధ్వర్యంలో రూపొందించిన మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను వర్చువల్‌గా పాల్గొని ప్రారంభించారు. సీఎస్ఐఆర్ జిజ్ఞాస కార్యక్రమంలో భాగంగా మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. సీఎస్ఆర్ఐ నేతృత్వంలో దేశవ్యాప్తంగా 37 పరిశోధన సంస్థలు పని చేస్తున్నాయన్నారు. బెంగళూరులోని విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్, టెక్నాలజికల్ మ్యూజియం తరహాలో హైదరాబాద్‌లోనూ ఏర్పాటు చేసేందుకు కేంద్రం వద్ద ప్రతిపాదనలు ఉన్నట్లుగా తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులకు వైజ్ఞానిక రంగంపై ఆసక్తిని పెంచడంలో సైన్స్ మ్యూజియం సహకరిస్తుందన్నారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 26 సైన్స్ మ్యూజియాలను, రీజినల్ రీసెర్చ్ సెంటర్లను నిర్వహిస్తున్నదని, వాటి ద్వారా సైన్స్, సైంటిఫిక్ రంగంలో జరిగే పరిశోధనలపై అవగాహన కల్పించేందుకు సైన్స్ మ్యూజియం కృషి చేస్తుందన్నారు. కాగా, బెంగళూరులో ఉన్న సైన్స్ మ్యూజియం ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఈ మ్యూజియంలో బయాలజీ, ఫిజిక్స్ వంటి రంగాల్లో శాస్త్రవేత్తల నమూనా ఆవిష్కరణలు, స్పేస్ టెక్నాలజీ, ప్లాంట్ టెక్నాలజీ, కెమికల్ రంగాల్లో జరిగే పరిశోధనల్లో నమూనా లాబోరేటరీలను మ్యూజియంలో పొందుపరిచారు. ఇదే తరహాలో లైఫ్ సైన్సెస్ థీమ్‌తో హైదరాబాద్‌లోని సైన్స్ మ్యూజియం నిర్మాణం జరుగుతుందని సీఎస్ఐఆర్ వర్గాలు పేర్కొన్నాయి.

మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం

జన్యుపరంగా సంక్రమించే వ్యాధులపై అవగాహన అవసరమని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. సాయంత్రం ఐఐసీటీ ఆడిటోరియం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్ బస్సును ప్రారంభించారు. ఎయిడ్స్ నియంత్రణకు డ్రగ్‌తోపాటు కరోనాకు వ్యాక్సిన్ తయారు చేయడంలో ఐఐసీటీ ముఖ్య భూమికను పోషించిందని, భారత్ బయోటెక్ వాడుకలోకి తీసుకువచ్చిన కోవాగ్జిన్ వ్యాక్సిన్ ఐఐసీటీ సాంకేతికతతోనే రూపుదాల్చినట్లుగా డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎన్జీఆర్ డైరెక్టర్ ప్రకాశ్‌కుమార్, సీఎస్ఐఆర్-హెచ్ఆర్డీ హెడ్ డా.గీతావాణి, వీఐటీఎం డైరెక్టర్ సాధనతోపాటు పలువురు సైంటిస్టులు డా. తంగరాజన్, చందక్, డా. రామానుజ్ నారాయణ్‌తోపాటు పాల్గొన్నారు.

# దేశంలో తొలిసారిగా ఎంబిఏ - ఎంఎస్ఎంఇ మేనేజ్‌మెంట్ కోర్సును ప్రారంభించనున్న ని-ఎంఎస్ఎంఇ హైదరాబాద్




హైదరాబాద్, మే9:హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్ (నితి-ఎబఎవ) దేశంలో తొలిసారిగా ఎంబిఎ - ఎంఎస్ఎంఇ మేనేజ్‌మెంట్ కోర్సును ప్రారంభించనున్నది. భువనేశ్వర్‌లోని ఏ ఎస్ బి ఎం విశ్వవిద్యాలయం సహకారంతో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్ నిర్వహించే కోర్సు 2023 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభమవుతుంది.

ఈరోజు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ని-ఎంఎస్ఎంఇ డైరెక్టర్ జనరల్ డాక్టర్ గ్లోరీ స్వరూప కోర్సు వివరాలు తెలిపారు. అభివృద్ధి చెందుతున్న ఎంఎస్ఎంఇ రంగానికి అవసరమైన శిక్షణ పొందిన మానవ వనరులను అందించే విధంగా ఎంబిఎ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. దేశంలో ఇటువంటి కోర్సు ప్రారంభం కావడం ఇదే తొలిసారి అని డాక్టర్ గ్లోరీ స్వరూప అన్నారు. 2020 జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా కోర్సును రూపొందించామన్నారు. ఎంఎస్ఎంఇ పనితీరుపై ప్రయోగాత్మక అనుభవం అందిస్తామన్నారు. హైదరాబాద్ ని-ఎంఎస్ఎంఇ, భువనేశ్వర్ కి చెందిన ప్రతిష్టాత్మక ఏఎస్బిఎం విశ్వవిద్యాలయం కలిసి కోర్సును అందిస్తాయి.

ప్రస్తుతం దేశ జిడిపిలో 8%, ఉత్పాదక ఉత్పత్తిలో 45%, ఎగుమతుల్లో 40% వాటాతో దేశంలో సూక్ష్మ, చిన్న,మధ్యతరహా పరిశ్రమలు దేశాభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని డాక్టర్ గ్లోరీ స్వరూప తెలిపారు. సూక్ష్మ, చిన్న,మధ్యతరహా పరిశ్రమలు 50 మిలియన్ల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి అని వివరించారు. భవిష్యత్తులో సూక్ష్మ, చిన్న,మధ్యతరహా పరిశ్రమల ప్రాధాన్యత మరింత పెరుగుతుందన్నారు. సూక్ష్మ, చిన్న,మధ్యతరహా పరిశ్రమలకు శిక్షణ పొందిన సిబ్బంది అవసరం ఉంటుందని డాక్టర్ గ్లోరీ స్వరూప తెలిపారు. సంస్థ ప్రారంభించనున్న ఎంబిఎ - ఎంఎస్ఎంఇ మేనేజ్‌మెంట్ కోర్సు శిక్షణ పొందిన సిబ్బందిని సిద్ధం చేయడంతో పాటు యువతను వ్యవస్థాపకులుగా అభివృద్ధి చేయడానికి దోహదపడుతుందన్నారు.

డిగ్రీ లో 50% మార్కులు పొంది క్యాట్ /ఎక్స్ ఎ టి/మ్యాట్/ ఏ ఎస్ బి ఎం యులో అర్హత సాధించిన వారు తాము అందిస్తున్న ఎంబిఎ కోర్సులో చేరవచ్చునని ఏ ఎస్ బి ఎం విశ్వవిద్యాలయం అధ్యక్షుడు ప్రొఫెసర్ బిశ్వజిత్ పట్నాయక్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టార్ విద్యా నేషనల్ స్కీమ్ కింద విద్యా రుణాన్ని అందజేస్తుంది, దీనికి సంబంధించి బ్యాంక్ ఇప్పటికే ఏఎస్ బిఎం విశ్వవిద్యాలయాని వర్తమానం పంపిందని ప్రొఫెసర్ బిశ్వజిత్ పట్నాయక్ తెలిపారు.

పూర్తి రెసిడెన్షియల్ విధానంలో కోర్సును అందిస్తామని తెలిపిన ప్రొఫెసర్ బిశ్వజిత్ పట్నాయక్ విద్యార్థులు తమ మొదటి-సంవత్సరం కోర్సులను (2 సెమిస్టర్‌లు) భువనేశ్వర్‌లోని ఏఎస్ బిఎం విశ్వవిద్యాలయంలో, రెండవ సంవత్సరం (మరో 2 సెమిస్టర్‌లు) ని ని-ఎంఎస్ఎంఇ హైదరాబాద్ లో అధ్యయనం చేస్తారని వివరించారు. హైదరాబాద్‌లోని ఎంఎస్ఎంఈలో నిపుణులు అందించే పాఠాలు, వృత్తి పరమైన అనుభవం విద్యార్థుల వృత్తిపరమైన నైపుణ్యాన్ని మెరుగుపరుస్తుంది.

# సంపూర్ణ అంధత్వ నిర్మూలన ప్రభుత్వం లక్ష్యం : ఎమ్మెల్యే రవీంద్ర కుమార్



నల్గొండ, మే9: కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ శాసన సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్ కోరారు. మంగళవారం దేవరకొండ మండలం మర్రిచెట్టు తండాలో నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

ఆయన మాట్లాడుతూ సంపూర్ణ అంధత్వ నిర్మూలన ప్రభుత్వం లక్ష్యమని వెల్లడించారు. మానవ శరీరంలో అన్నిటి కంటే ప్రధానమని తెలిసి కూడా కంటి చూపు పట్ల నిర్లక్ష్యం వహిస్తూ శాశ్వతంగా చూపు కోల్పోతున్న లక్షలాది మందిని చైతన్యపరిచే, ఆదుకోవాలనే ముఖ్య మంత్రి కేసీఆర్‌ఆలోచనల నుంచి పుట్టినదే కంటి వెలుగు అని ఆయన అన్నారు.

ప్రభుత్వమే నేరుగా పట్టణ, గ్రామాల్లోకి వెళ్లి శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారని, కంటి వెలుగు ఉద్యమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మారుపాకుల అరుణ సురేష్ గౌడ్, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నేనావత్ శ్రీను నాయక్, ఎంపీడీవో శర్మ, ఎంపీటీసీ కొర్ర గౌతమిరాంసింగ్, గ్రామ శాఖ అధ్యక్షుడు బావోజి, బొడ్డుపల్లి కృష్ణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఖ్యాతిని చాటిన ఇంటర్ విద్యార్థులు విద్యార్థులు

**- ఎంపీసీలో నిఖిల్, బైపీసీలో రోహిణీ**

**- 990 మార్కులతో రోహిణీ(బైపీసీ) రాష్ట్రంలోనే ప్రభుత్వ కళాశాలల్లో ప్రథమ స్థానం**

**- విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించిన మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**



ఖమ్మం, మే9: (నేటినిజం ప్రతినిధి): నేడు ప్రకటించిన ఇంటర్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఖమ్మం జిల్లా విద్యార్థులను రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అభినందించారు. మంగళవారం ప్రకటించిన ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ఖమ్మం నగరం పాకబండ బజార్ కు చెందిన ఏఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థిని 990మార్కులు సాధించి రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లాను తొలి స్థానంలో నిలిపిందన్నారు. ఖమ్మంజిల్లా బొనకల్ మండల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన నిఖిల్(ఎంపీసీ) 984, ఖమ్మం నగరం పాకబండ బజార్ కు చెందిన ఏఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని రోహిణి(బైపీసీ) 990 మార్కులు సాధించి రాష్ట్రంలోనే ప్రభుత్వ కళాశాలల్లో ప్రథమ స్థానం లో నిలవడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ రోహిణీని ప్రత్యేకంగా అభినందించారు. ప్రైవేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు పరీక్షల్లో మంచి ప్రతిభను కనబర్చడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రతిభ ఏ ఒక్కరి సొంతం కాదని, కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. గురువులు చెప్పిన విషయాలను అనుసరించి సమయాన్ని వృధా చేయకుండా చదివితే విజేతలుగా నిలుస్తారని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు నిరూపించారని అన్నారు. ఖమ్మం జిల్లా ఖ్యాతిని రాష్ట్ర స్థాయిలోచాటిన విద్యార్థులను, ఉత్తమ విద్యార్థులకు తీర్చిదిద్దేందుకు ఆహర్నిశలు శ్రమిస్తున్న ఉపాధ్యాయులను, సిబ్బందిని, ప్రోత్సహిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులను ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు కృషితో, పట్టుదలతో ఉన్నతమైన విజయాలను సాధిస్తూ కన్న తల్లిదండ్రులకు, పుట్టి పెరిగిన గ్రామాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. గతంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో వెనుకబడిన జిల్లాగా పిలిచేవారని.. కానీ నేడు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అన్ని రంగాల్లో దూసుకుపోతుందని ముఖ్యంగా విద్యా రంగంలో ఈ ప్రాంత విద్యార్థులు తమ సత్తా చాటుతున్నారని తెలిపారు. ఇంటర్ విద్యా వ్యవస్థపై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోడం వల్లే ఈసారి గురుకులాలు, కేజీబీవీలు, ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారని పేర్కొన్నారు.

# ఇంటర్ ఫలితాలలో "ఆల్ఫోర్స్" జయకేతనం

## –ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా॥ వి. నరేందర్ రెడ్డి







కరీంనగర్, మే 9: (నేటినిజం ప్రతినిధి): ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలు మంగళవారం విడుదల కాగా,అల్ఫోర్స్ విద్యా సంస్థల విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన,వటిష్టమైన ప్రణాళిక అంశాలతోనే అత్యధిక మార్కులు సాధించినట్లు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన వారిలో సీనియర్ ఇంటర్మీడియట్ ఎంపీసీ విభాగంలో ఏస్ హర్షిత 992/1000, ఎస్ ఉజ్వల్ 992/1000, ఎస్ హరిణి 992/1000, జి వినిత 992/1000, కె రాజశేఖర్ 992/1000, ఎస్ ప్రణతి 991/1000, డి వివేకవర్ధన్ 991/1000, సిహెచ్ రిషిత 991/1000, బి హరిణి 991/1000, యమ్ అరుణ్ కుమార్ 991, యమ్ ప్రణవి 990/1000, జి సుదేష్ణ 990/1000, టి స్ఫూర్తి 990/1000, ఏ అక్షయ 990/1000, టి శ్రీజ 990/1000 మార్కులు సాధించి, ఉన్నతస్థానంలో నిలిచారు. 28 మంది విద్యార్థులు 989 ఆపైన మార్కులు సాధించడం విశేషం. బైపిసి విభాగంలో 1000 మార్కులకు గాను యస్ నిహారిక 992, పి నిహారిక 990, జి నవ్య 990, యస్ మనస్విని 990, మార్కులు సాధించారు. ఎంఈసిలో సిహెచ్ మనిషి 988, జి అమూల్యా 988, టి అర్చన, ప్రవళిక 984 మార్కులు సాధించారు. 20 మంది విద్యార్థులు 970, అపై మార్కులు సాధించారు. సీఈసీ విభాగంలో 1000 మార్కులకు గాను యమ్ సాయిప్రసన్న 984, బి ప్రియాంక 982 మార్కులు. సాధించారు. 10 మంది విద్యార్థులు 970 ఆపై మార్కులు సాధించారు.

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపిసిలో టి. సాయిత్య 467, టి చరిత 467, డి సునిత 467, కె కార్తిక్ బాబు 467, ఎస్ రిషిక 467, వి అనన్య 467, ఏ స్మృతకీర్తి 467,పి చరణ్య 467, పి శ్రీశాంత్ రెడ్డి 467, ఎమ్ రాకేష్ 467, మార్కులు సాధించిఅత్యుత్తమ స్థానంలో నిలిచా రు. 10 మంది విద్యార్థులు 467 మార్కులు, 36 మంది విద్యార్థులు 466 మార్కులు, 52 మంది విద్యార్థులు 465 మార్కులు సాధించి అల్ఫోర్స్ ఖ్యాతిని పెంచారు. బైపిసిలో ఏ శ్రీనిధి 437, సిహెచ్ నిఖిల్ 436, ఠాకూర్ సాయిచరన్ 436, ఇ ఐశ్వ ర్యపర్మ 436, మార్కులు సాధించారు. 9 మంది విద్యార్థులు 435 అపై మార్కులు సాధించారు. ఎంఈసి విభాగంలో వినమ్రత 488, మార్కులు, సీఈసీ విభాగంలో 500 మార్కులకు గాను నిమ్రాఅజ్మీ 490 మార్కులు సాధించారు. ఎంఈసి విభాగములో 480 ఆపై మార్కులు 5 గురు విద్యార్థులు సాధించగా, సీఈసీ విభాగంలో 8 మందివిద్యార్థులు సాధించారు.

ఈ సందర్భంగా వేసినట్లు ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా వి నరేందర్ రెడ్డి మాట్లాడుతూఇటీవల ప్రకటించబడిన ఐఐటి మెయిన్ ఫలితాలలో అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుతంగా రాణించారని, రాబోయే నీట్, ఎమ్సెట్ ఫలితాలలో కూడా అఖండ విజయం సాధిస్తారని యాజమాన్యం ధీమా వ్యక్తంచేశారు.పటిష్ట ప్రణాళికతో విద్యాభోధన, పర్యవేక్షణ, విద్యార్థుల నిరంతర కృషి వల్ల ఇంతటి ఘనవిజయం సాధించడం జరిగిందన్నారు. ఇంటర్ ఫలితాలలో అద్భుత మార్కులు సాధించిన మా అల్ఫోర్స్ ఆణిముత్యాలను, వారి తల్లిదండ్రులను అభినందించారు.

# ప్రజా ఆరోగ్యంకై ప్రతిమా ఫౌండేషన్ దృష్టి

## – ఫాజుల్ నగర్ లో నేడు శుద్ధ జల కేంద్రం ప్రారంభం

రాజన్న సిరిసిల్ల, మే9:(నేటి నిజం ప్రతినిధి): వేములవాడ రూరల్ మండలం ఫాజుల్ నగర్గ్రామంలో నేడు బుధవారం ప్రతిమా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుద్ధ జల కేంద్రాన్ని ఫౌండేషన్ చైర్మన్ వికాస్ రావు ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న మంచినీటి సమస్యపై

సర్పంచ్ నాగుల వేణు, గోపాల్, వైస్ ఎంపిపి జక్కుల కవిత, తిరుపతిలుప్రతిమా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చెన్నమనేని వికాస్

దృష్టికి తీసుకు రాగా, వారి అభ్యర్ధనకు స్పందించి ఉచిత మంచి నీటి శుద్ధ జల కేంద్రంని గ్రామంలో నెలకొల్పడానికి భావించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ వికాస్ రావుఅనేక రకాల జబ్బులకు కలుషిత నీరే కారణం అని, త్రాగే నీరు శుద్ధ జలమై ఉండాలని అన్నారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ఈ మంచి నీటి శుద్ధ జల కేంద్రంను అందజేయడం జరిగిందన్నారు.

# పిడుగుపాటుకు నష్టపోయిన రైతుకు గోలి మోహన్ పరామర్శ



రాజన్న సిరిసిల్ల, మే9:(నేటి నిజం ప్రతినిధి): కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో పిడుగుపాటుకు నష్టపోయిన రైతుగుడపాటి మోహన్ రెడ్డిని డాక్టర్ గోలి మోహన్ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా గోలి మోహన్ రైతుని విచారించగా, పిడుగుపాటుకు గురై ఒక ఎద్దు, ఒక గేదెను కోల్పోవడమే కాకుండా తాను కూడా తీవ్ర గాయాలతో బయటపడ్డాడని తెలిపారు. కాగా జరిగిన నష్టాన్ని గోలి మోహన్ సంబంధిత అధికారులతో మాట్లాడి, వీలైనంత తొందరగా నష్టాన్ని అంచనా వేసి రైతుకు నష్టపరిహారం వచ్చేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తన వంతు సహకారాన్ని కూడా అందిస్తానని మాట ఇచ్చారు. రాబోయే రోజుల్లో వేములవాడ నియోజకవర్గంలోని ప్రతి రైతుకు ఒక నూతన వ్యవసాయ విధానాన్ని రూపొందించి, రైతుకు మంచి లాభాలు ఇచ్చే పంటలను తీసుకొస్తానని తెలిపారు. ప్రతి రైతు తాను నమ్ముకున్న పొలాన్ని సరియైన పోషక పదార్థాలు ఉండే విధంగా భూమిని తీర్చిదిద్దుకోవాలని, అందుకోసం భూసారవంతమైన ఎరువులను వాడి అధిక లాభం పొందే విధంగా రూపొందించాలని సూచించారు. అనంతరం గుడిపాటి మోహన్ రెడ్డి మాట్లాడుతూ తన అదృష్టం వల్ల ప్రాణ నష్టం కాకుండా బయటపడ్డానని, కానీ జీవనాధారం అయిన ఎద్దు, గేదలను కోల్పోయానని వాపోయాడు. తన రెండు కాళ్లకు గాయాలు అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశాడు. వ్యవసాయం ద్వారా మాత్రమే జీవనాధారం గడుస్తుందని, ఇప్పుడు వ్యవసాయం చేసుకొనుటకు ఎద్దు లేదని, ప్రభుత్వం దయతలచి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతు సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

# ఘనంగా రెడ్‌క్రాస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

## –జే ఆర్ సి మరియు వై ఆర్ సి లకు సర్టిఫికేట్ లు ప్రదానం



హైదరాబాద్ మే 9 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);వరల్డ్ రెడ్ క్రాస్ సొసైటీ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ జయంతి ని పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కు ముఖ్య అతిథులు మన రాష్ట్ర శాసన మండలి సభ్యులు ఎ. వి. యన్ రెడ్డి , ఎ. సి. పి రామదాసు తేజోవత్, టి బి–హైదరాబాద్ కన్వీనర్ డా. బి. విజయ్ భాస్కర్ గౌడ్ , ఇందిరా ప్రియదర్శిని గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ ప్రిన్సిపల్ , డా. డి. వరలక్ష్మి గారు,రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ అగ్రికల్చర్ మరియు విజిలెన్స్ ఆఫీసర్ , మహేంద్ర రెడ్డి గారు, పవన్ పుత్ర ఎంటర్ ప్రైజర్ యం. డి ఎ. వి రావు , విచ్చేశారు. తెలంగాణ శాసన మండలి సభ్యులు ఎ. వి. యన్ రెడ్డి , జెండాను ఆవిష్కరించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో జే ఆర్ సి మరియు వై ఆర్ సి విద్యార్థులకు హెన్రీ డ్యూనాంట్ జయంతి సందర్భంగా సర్టిఫికేట్ లను ఎ. వి. యన్ రెడ్డి , చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఎ. వి. యన్ రెడ్డి మాట్లాడుతూ చిన్నతనం నుంచి సేవా భావాలను నేర్చు కోవాలని విద్యార్థులకు సూచించారు. నా వంతు సహాయం గా రెడ్ క్రాస్ కు చేస్తాను అని తెలిపారు. ఎ. సి పి రామదాసు తేజోవత్ మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్న భీమ్ రెడ్డి గారిని అభినందించారు. ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగాలని కోరారు. చివరగా భీమ్ రెడ్డి మాట్లాడుతూ మీ అందరి సహాయ సహకారాలు ఉన్నంత వరకు ఈ కార్యక్రమాలు సేవాభావం తో ముందు తీసుకెళ్తామని మరియు మానవతా దృక్పథంతో దాతలు ముందుకు వచ్చి క్షయ వ్యాధి రోగులు కు విరాళాలు అందించి ప్రాణ దాత లు కావాలని పిలుపునిచ్చారు. భీమ్ రెడ్డి గారు ప్రత్యేకం గా ఠాగూర్ స్కూల్ యాజమాన్యం మరియు విద్యార్థులు కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ చైర్మన్ విజయ కుమారి, యం సి సభ్యులు అనురాధ, రియాజుద్దీన్, వినయ్ కిశోర్, సందేష్ హోర్ద, అరుణ్ రవి నాదన్, వై. ఆర్ సి కన్వీనర్ ఉదయ్ శ్రీ, జె.ఆర్ సి కన్వీనర్ కళావతి మరియు విద్యార్థులు, డివిజన్ కన్వీనర్ ధర్మ తేజ, మండల కన్వీనర్ ఆయూబ్ ఖాన్, ప్రవీణ్ కుమార్, మాజీద్, జ్యోతి వాలంటీర్లు కార్యాలయ సిబ్బంది లక్ష్మి, వెంకట్, మహేంద్ర రెడ్డి, సత్య లక్ష్మి, మమత, అనిత, నహీమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫెయిల్ అయ్యాననే మనస్తాపం.. ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

కరీంనగర్, మే 9: (జగిత్యాల జిల్లాలో దారుణం జరిగింది. మెడిపెల్లి మండలానికి చెందిన ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇవ్వాల (మంగళవారం) వచ్చిన ఇంటర్మీడియట్ ఫలితాలలో ఫెయిల్ అయ్యాననే మనస్తాపంతో బొడ్డుపెల్లి అభిషేక్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు.

ఇలాంటి నిర్ణయం మరే విద్యార్థి తీసుకోవద్దని, కుటుంబ సభ్యులకు తోడుగా ఉండాలని అధికారులు కోరుతున్నారు. ఫెయిల్? కావడం అనేది పెద్ద సమస్య కాదని, మళ్లీ పరీక్ష రాసి సత్తా చాటుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. ఒకవేళ చదువులో వీక్? అయితే.. మరే ఇతర పనిలో అయినా చేరి తల్లిదండ్రులకు, దోస్తులకు దగ్గరగా ఉండే అవకాశాన్ని ఎంచుకోవాలని సూచిస్తున్నారు.

# మీ బోనస్ డబ్బును తెలివిగా ఎలా పెట్టుబడి పెట్టాలి?

## –నవీన్ కుక్రేజా , పైసాబజార్ సహ వ్యవస్థాపకుడు సి ఇ ఓ

హైదరాబాద్, మే 9: మనమందరం చాలా కాలంగా ఆత్రంగా ఎదురుచూస్తున్న సంవత్సరం ఇదే. మదింపులు మరియు బోనస్ చెల్లింపుల కోసం సమయం! అయితే ఇది మీ ఉత్సాహాన్ని నియంత్రించుకోవలసిన సమయం కూడా. కాస్త ఆగి , మీ బోనస్ డబ్బును ఎలా పెంచుకోవచ్చో తెలివిగా ఆలోచించండి. ప్రస్తుతం మనం ఉన్న అస్థిర పరిస్థితుల దృష్ట్యా, ప్రతి ఒక్కరూ తెలివైన పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవడం మరియు ప్రాధాన్యత లేని విషయాల్లో తొందరపడకుండా ఉండటం అత్యవసరం. ఇలాంటి పరిస్థితుల్లో జీవిత లక్ష్యాలకు ప్రాధాన్యత ఇవ్వడం, పెట్టుబడులు పెట్టడం చాలా ముఖ్యం.దానికి మీరు తప్పనిసరిగా పరిగణించవలసిన నాలుగు విషయాలు ఉన్నాయి. అవి... 1. అత్యవసర నిధిని సృష్టించండి: ఎల్లప్పుడూ మీ ఇంటి కోణం నుండి మొదట ఆలోచించండి. మీ ఇంటి ఖర్చుల గురించి మీకు తెలిసిన వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకుంటే, 6–12 నెలల మధ్య అత్యవసర నిధిని సృష్టించడం ఎల్లప్పుడూ మంచిది. యువ నిపుణులు లేదా మీరు ఫ్రీలాన్సర్ అయితే 12 నెలల ఖర్చులను పక్కన పెట్టడం మంచిది. 2. ఆరోగ్య బీమా కవర్‌ను పొందండి: ఆరోగ్య బీమా కవర్‌ను క్రమబద్ధీకరించడం రెండవ ముఖ్యమైన విషయం. సాధారణంగా, ఆరోగ్య భీమా అనేది మీరు చేయాలనుకుంటున్నది కానీ కొన్నిసార్లు మీరు దీన్ని చేయలేరు ఎందుకంటే మీ నెలవారీ జీతం తగినంతగా ఉండకపోవచ్చు మెట్రోలకు, మెడికల్ కవర్ రూ. 5 లక్షల –7 లక్షలు సరిపోవు. మీరు మెట్రోలో బస చేస్తున్నట్లయితే, రూ.1 కోటి కంటే ఎక్కువ కవర్ తీసుకోవడం మంచిది మరియు అది ఖరీదైనది కాదు. కొన్ని ఆరోగ్య బీమా సంస్థలు రూ. 5–10 లక్షల బేస్ హెల్త్ కవర్లు మరియు రూ. 90–95 లక్షల టాప్–అప్ కవర్లతో చాలా తక్కువ ప్రీమియంలతో పాలసీలను అందిస్తాయి. 3. మీ హోమ్ లోన్‌ను ప్రీపే చేయడానికి ప్రయత్నించండి: మీరు మొదటి రెండు బాక్సులను టిక్ చేసి ఉంటే, మీ హోమ్ లోన్ ఒకటి ఉంటే దాన్ని చెల్లించడం తదుపరి సలహా. నేడు, గృహ రుణ రేట్లు దాదాపు 9% యానం . మరియు 8.5% పర్ యానం సంపాదించడం చాలా కష్టం. కాబట్టి, హౌసింగ్ లోన్ అనేది మీరు ఈరోజు ప్రీపే చేయడం గురించి చూడాలి. ముందస్తు చెల్లింపులు చేస్తున్నప్పుడు, ఈ ఎం ఐ తగ్గింపు కంటే వడ్డీ ధరలో అధిక పొదుపును పొందుతుంది. ఇప్పటికే ఉన్న గృహ రుణగ్రహీతలు హోమ్ సేవర్, హోమ్ లోన్ అడ్వాంటేజ్, మాక్స్‌గెయిన్, హోమ్ లోన్ ఇంట్రెస్ట్ సేవర్ మొదలైన బ్రాండ్ పేర్లతో వివిధ రుణదాతలు అందించే హోమ్ లోన్ ఓవర్‌డ్రాఫ్ట్ ఖాతాలను కూడా తెరవవచ్చు. 4. దీర్ఘకాలిక పెట్టుబడి హోరిజోన్ కోసం ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టండి: సందేహం లేకుండా, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టడం దీర్ఘకాలిక కోణం నుండి ఉత్తమమైనది. మ్యూచువల్ ఫండ్స్‌లో, నేను వ్యక్తిగతంగా లార్జ్ క్యాప్ ఇండెక్స్ ఫండ్‌లు మరియు ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌లను చూస్తాను ఎందుకంటే ఈ రెండు మంచి వర్గాలు. 5. షెడ్యూల్డ్ బ్యాంకులతో అధిక దిగుబడినిచ్చే ఎఫ్ డి లను తెరవండి ప్రస్తుతం, చాలా చిన్న ఫైనాన్స్ బ్యాంకులు మరియు అనేక ప్రైవేట్ రంగ బ్యాంకులు 7.5% మరియు అంతకంటే ఎక్కువ ఎఫ్ డి రాబడులను అందిస్తున్నాయి. ఈ బ్యాంకులు షెడ్యూల్డ్ బ్యాంక్‌లుగా వర్గీకరించబడ్డాయి, మూలధన రక్షణ మరియు ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు కారణం గా ఫిక్స్‌డ్ డిపాజిట్లలోకి ప్రవేశించడానికి మరియు స్వల్పకాలిక ఆర్థిక లక్ష్యాల కోసం పెట్టుబడి పెట్టడానికి ఇది గొప్ప సమయం.

**BEFORE THE MOTOR ACCIDENTS CLAIM TRIBUNAL-CUM- I ADDL CHIEF JUDGE C.C.C.**
**AT SECUNDERABAD**
**O.P. NO.763 OF 2022**
Between:
**Mr. Katta Samba Shiva Rao @ Sambashiva Rao @ K. Sambhasiva Rao**
...Petitioner
**And**
**Mr. Burma Vineeth & Others**
...Respondents
To
1.Mr. Burma Vineeth
S/o. B. Ram Mohan Rao
Aged about: 23 years
Occ: Rider of the crime Vehicle, R/o. Block No.5 Flat No.112, Prajay Apartments, Kompally, Quthbullapur (M), Medchal Dist-500014.
2.Smt. Burma Sheela Rani, W/o. B. Ram Mohan Rao, Aged about:Major
Occ: Owner of the crime Vehicle, R/o. H.No. 3-37, Dulapally Near Ramalayam Temple Dulpally,
Medchal Dist-500014.
**NOTICE**
Please take notice that in the above matter the Petitioner had filed a case against you (Respondent No.1&2) for compensation of Rs.16,00,000/- and the same is posted for your appearance on14-06-2023.
You are advised to appear on14-06-2023 at about 10.30 a.m. before the said court either in person or through an Advocate failing which, the case will be decided exparte.
(BY THE ORDER OF THE COURT)
**K.S. JAYA BABU RAO**
**Advocate**
Counsel for Petitioner
Off: #1-10-98/20, 2nd floor, Near Vatsalya Guest House, Care Plus Clinic, Dwarakadas Colony, Begumpet, Hyderabad-16.
Cell: 9849531963

# ఈటో మోటార్స్' కాకాచిగూడ రైల్వే స్టేషన్లో ఈ - ఆటోలు ప్రారంభం




హైదరాబాద్, మే9: ఈటో మొబిలిటీ సర్వీసెస్ ఆధ్వర్యంలో కాచిగూడ రైల్వే స్టేషన్‌లో సోమవారం ఎలక్ట్రిక్ ఆటోలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటో మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో పవన్ చావలి మాట్లాడుతూ పట్టణ రవాణాను మార్చాలనే దృఢమైన నిబద్ధతతో ఈటో మోటార్స్ సౌత్‌తో భాగస్వామ్యంతో హైదరాబాద్‌లోని కాచిగూడ స్టేషన్‌లో 15 ఈ – ఆటోలను ప్రారంభించామన్నారు. ఈటో మోటార్స్ దక్షిణ మధ్య రైల్వే సహకారంతో ఇతర స్టేషన్లలో తన ఈవీ వాహనాలను విస్తరించే ప్రక్రియలో ఉందన్నారు. హైదరాబాద్‌లో 500 ఈ–ఆటోలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నగరంలో ఇప్పటికే 120 ఈ–ఆటోలు నడుస్తున్నాయన్నారు. ఈ ఎలక్ట్రిక్ ఆటోలు అత్యాధునిక భద్రతా లక్షణాలను కలిగి ఉంటాయన్నారు. ప్రయాణీకులు, డ్రైవర్ల భద్రతకు భరోసా ఇచ్చే లాట్ సాంకేతికతను కలిగి ఉన్నాయన్నారు. ఈటో మోటార్స్ మెట్రో స్టేషన్‌లో వారి యాజమాన్య ఛార్జింగ్ సొల్యూషన్ – థండర్‌బాక్స్ ద్వారా ఆధారితమైన ఈవీ ఛార్జింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేసిందన్నారు. ఈ అత్యాధునిక ఛార్జింగ్ నెట్‌వర్క్ ఒకేసారి 30 ఎలక్ట్రిక్ వాహనాల వరకు ఛార్జ్ చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉందన్నారు. మా ఎలక్ట్రిక్ వాహనాలు, ఛార్జింగ్ మౌలిక సదుపాయాల ద్వారా హరిత విప్లవంలో ప్రధాన భాగమైనందుకు ఎంతో గర్విస్తున్నామన్నారు

# ఈ నెలాఖరులోగా గత ఏడాది రబీ సీఎంఆర్ లక్ష్యం పూర్తిచేయాలి

## –జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



రాజన్న సిరిసిల్ల, మే9:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రైస్ మిల్లర్లు గత సంవత్సరపు 2021–22 రబీ సీజన్ పంటకు సంబంధించి సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్)లక్ష్యాన్ని నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మిల్లర్లను ఆదేశించారు.

మంగళవారం పౌర సరఫరాల శాఖ అధికారులు, మిల్లర్లతో సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) లక్ష్యం మేరకు భారత ఆహార సంస్థ కు అందజేత, రబీ ధాన్యం కొనుగోలుపై ఐడివోసి మీటింగ్ హాల్ లో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూగత సంవత్సరపు 2021–22 రబీ సీజన్ పంటకు సంబంధించి సీఎంఆర్ ప్రాసెసింగ్, అప్పగింత లక్ష్యం ను భారత ఆహార సంస్థ నెల పాటు పొడిగించిందనీ అన్నారు. ఈ నెలలో లక్ష్యం పూర్తి చేయకపోతే మిల్లర్ లకు, ప్రభుత్వానికీ నష్టం వాటిల్లుతుందన్నారు.

వచ్చే 20 రోజులు దీనిపై దృష్టి పెట్టి క్లియర్ చేయాలన్నారు.

అలాగే జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలు సజావుగా జరిగేలా అధికారులు ప్రత్యేక చర్య తీసుకోవాలని అన్నారు. దురదృష్టవశాత్తు వర్షాల వల్ల ధాన్యం తడవడం ఫలితంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను అర్థం చేసుకుంటూ సాధ్యమైనంత త్వరగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని సాధ్యమైనంత త్వరగా రైస్ మిల్లులకు తరలించేలా చూడాలన్నారు.

ఏదైనా ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం పెద్ద ఎత్తున పోగు బడి ఉంటే వెంటనే వెహికల్ కాంట్రాక్టర్ తో మాట్లాడి వెంటనే క్లియర్ చేయాలి అన్నారు.

ధాన్యం కొనుగోలు తో పాటు ధాన్యం ప్రాసెసింగ్ త్వరితగతిన అయ్యేలా రెవెన్యూ అధికారులు అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేయడంలో కీలకపాత్ర వహించాలన్నారు. ఈ నెలలో మొత్తం ధాన్యం సేకరణ, ప్రాసెస్ పై ప్రత్యేక దృష్టి సారించాలని తాసిల్దార్లకు జిల్లా కలెక్టర్ సూచించారు.

ధాన్యం డౌన్లోడింగ్ వేగంగా జరిగేందుకు రైస్ మిల్లర్లు సహకరించాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్,జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్ రెడ్డి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జితేంద్ర ప్రసాద్ తహశీల్దార్ లు, రైస్ మిల్లర్లు, వెహికల్ కాంట్రాక్టర్ లు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాలలో కేజీబీవి విద్యార్థుల ప్రతిభ



రాజన్న సిరిసిల్ల, మే9:(నేటినిజం ప్రతినిధి): విద్యా శాఖ ప్రకటించిన ఇంటర్ ప్రథమ సంవత్సర పలితాలలో సిరిసిల్ల కెజిబివి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. పి శరణ్య 463/470 (ఎంపీసీ, మర్రిపల్లి), ఎం ప్రసన్న430/440 (బైపిసి,

తంగల్లపల్లి, కె సంధ్య. 486/1000,

హసిని 486/1000 (ఎంపిహెచ్ డబ్ల్యు) మార్కులుసాధించారు.ద్వితీయ సంవత్సరంలోడి అఖిల 964/1000 (బైపిసి, సిరిసిల్ల), పి సంధ్య 985/1000 (ఎంపీసీ, మర్రిపల్లి), పి మౌనిక 942/1000 (సీఈసీ, గంభీరావుపేట), నిఖిత 955/1000 (ఎంపిహెచ్ డబ్ల్యు) సాధించారు.అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి,జిల్లా విద్యాధికారి ఈ రమేష్ కుమార్ అభినందించారు.

# సుడానిధులతో సిసిరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన



ఖమ్మం, మే9: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని40,42వ డివిజన్లలో మంగళవారం సుడానిధులు రూ.40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ,సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దాదే అమృతమ్మ సతీష్,పాకలపాటి విజయనిర్మల శేషగిరి,బిఆర్ఎస్ పార్టీ నాయకులు సురేష్, సిరాజ్,జని,హమీద్, యూసఫ్, ఖజాబి,మజీద్, యాసిన్,గౌస్, అర్షద్, అహ్మద్,గోపి,నరేష్,40,42 డివిజన్ల కార్యకర్తలు,మహిళలు,మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు డిఈ స్వరూప రాణి,ఏఈ నవ్య జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.